# క్రైమ్ మిర్రర్®

Voice of Anti Corruption

హైదరాబాద్
1-10-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక:192

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD





ఖైరతాబాద్ ఎన్నికల కంటే ముందుగానే గ్రేటర్ ఎన్నికలు నిర్వహిస్తారా? రేవంత్ సర్కార్ అంత సాహసం చేస్తుందా? అనేది ఇప్పుడు అందరిలో ఉన్న అనుమానం. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి దాదాపు మూడేళ్లు సమీపిస్తోంది. కానీ ఈ రాష్ట్రానికి కీలకమైన గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ ఎన్నికల విషయంలో మాత్రం కాంగ్రెస్ ఎందుకు భయపడుతోంది. హైదరాబాదును మూడు మున్సిపల్ కార్పొరేషన్లుగా విభజించారు. జీహెచ్ఎంసి, సైబరాబాద్, మల్కాజిగిరిగా విభజించి.. సుమారు 300 డివిజన్ల పునర్విభజన చేపట్టారు. అంతవరకు సాహసమైన అడుగులు వేసింది కాంగ్రెస్.



కానీ ఎన్నికల నిర్వహణకు వచ్చేసరికి మాత్రం దాగుడుమూతలు ఆడుతోంది. పాలనా సంస్కరణలు, అభివృద్ధి కార్యక్రమాలపై రోజుకో ప్రకటన చేస్తున్న సీఎం రేవంత్.. భాగ్యనగరంలో ప్రజా తీర్పును ఎదుర్కోవడానికి ఎందుకు వెనుకడుగు వేస్తున్నారు అనేది తెలంగాణ రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్న మాట.

**కోర్టు కేసులు పరిష్కరించడం..**

గ్రేటర్ ఎన్నికల విషయంలో కాంగ్రెస్ ఒక వాదనను తెరపైకి తెచ్చింది. అవే కోర్టు కేసులు. మూడు కార్పొరేషన్ల ఏర్పాటు, డివిజన్ల పునర్విభజన జీవోలపై హైకోర్టులో పిటిషన్లు, న్యాయపరమైన చిక్కులు ఉన్నాయని సాకు చెబుతోంది. కానీ ప్రభుత్వం చిత్తశుద్ధితో సంకల్పిస్తే ఈ న్యాయవివాదాలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించడం పెద్ద విషయం కాదు. సమగ్ర కౌంటర్లు దాఖలు చేసి... కోర్టు ఆమోదం పొంది ఎన్నికల ప్రక్రియను పట్టాలెక్కించే పూర్తి అధికారం, యంత్రాంగం ప్రభుత్వం చేతిలోనే ఉన్నాయి. న్యాయపరమైన అంశాల వెనుక దాక్కోవడం కాకుండా.. చట్టబద్ధమైన అడ్డంకులు తొలగించుకొని

# కేటీఆర్ అడ్డాలో
# రేవంత్ రచ్చ..

“మీ ఆస్తుల లెక్క తేలుస్తా” అంటూ కేసీఆర్‌కు రేవంత్ సవాల్

సిరిసిల్ల సభలో రేవంత్ సంచలన వ్యాఖ్యలు..

కేసీఆర్ కుటుంబాన్నే టార్గెట్ చేసిన సీఎం ఓపెన్ ఛాలెంజ్

కేసీఆర్ కుటుంబంపై సీఎం రేవంత్ తీవ్ర ఆరోపణలు

“మీ ఆస్తులపై శ్వేతపత్రం విడుదల చేయండి” అంటూ కేసీఆర్‌కు సవాల్

సిరిసిల్లను గత పాలకులు సమస్యల సిరిగా మార్చారని విమర్శ

చేనేత కుటుంబాలు, గల్ఫ్ కార్మికుల సమస్యలపై బీఆర్ఎస్‌ను నిలదీసిన సీఎం



2లో

సిరిసిల్ల, సెప్టెంబర్ 30: తెలంగాణ రాజకీయాల్లో మరోసారి ‘ఆస్తులు’ వర్సెస్ ‘అభివృద్ధి’ చర్చ తెరపైకి వచ్చింది. బీఆర్ఎస్ కీలక నేత కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్ల గడ్డపై అడుగుపెట్టిన సీఎం రేవంత్‌రెడ్డి.. మాజీ సీఎం కేసీఆర్ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని తీవ్ర విమర్శలు చేశారు. అంతటితో ఆగకుండా.. తమ కుటుంబ ఆస్తులపై శ్వేతపత్రం విడుదల చేసే ధైర్యం ఉందా అంటూ కేసీఆర్‌కు సవాల్ విసిరారు. సీఎం వ్యాఖ్యలతో సిరిసిల్ల సభలో రాజకీయ వేడి మరింత పెరిగింది.

- మిగతా 2వ పేజీలో

## జగన్ కాంగ్రెస్‌లోకి వస్తే?

జగన్‌తో పాటు పాత కాంగ్రెస్ నేతలకు భట్టి కీలక పిలుపు

“వాళ్లంతా తిరిగొస్తే నేనే ఎక్కువ సంతోషిస్తా” అంటూ వ్యాఖ్య

రేవంత్‌తో విభేదాలపై క్లారిటీ.. కలిసి పనిచేస్తున్నామని వెల్లడి

కేంద్రం, ఓటర్ల జాబితా, తెలంగాణకు నిధులపై తీవ్ర విమర్శలు

2లో



## పేరు మారితే అంతా మారిపోతుందా? కేటీఆర్

టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్‌గా పేరు మార్పుపై కేటీఆర్ వివరణ

“పేరు షారుఖ్ ఖాన్ అని పెట్టుకుంటే షారుఖ్ ఖాన్ అవుతారా?” అంటూ వ్యాఖ్య

వచ్చే ఎన్నికల్లో కేసీఆరే తమ సీఎం అభ్యర్థి అని స్పష్టీకరణ

కాంగ్రెస్, బీజేపీతో పాటు ఈసీ పనితీరుపైనా తీవ్ర విమర్శలు

3లో



3లో

## రెండు సీట్లు..
## ఇద్దరూ రెడ్డిలేనా?
### కాంగ్రెస్‌పై కవిత ఫైర్

రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలపై కవిత తీవ్ర అభ్యంతరం

సామాజిక ప్రాతినిధ్యంపై కాంగ్రెస్‌ను నిలదీసిన తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు

మహబూబ్‌నగర్--రంగారెడ్డి--హైదరాబాద్ స్థానానికి సామ రామ్మోహన్‌రెడ్డి

నల్గొండ--ఖమ్మం--వరంగల్ స్థానానికి రామిరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 30: తెలంగాణలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల వేడి మొదలయ్యేలోపే రాజకీయ విమర్శలు ఊపందుకున్నాయి.

## మహిళలకు ఫ్రీ జర్నీ..

ఏపీ బస్సుల్లోనూ మహిళలకు ఉచిత ప్రయాణం అందించే దిశగా ఏపీ ప్రభుత్వం అడుగులు

ప్రస్తుతం కొన్ని రకాల ఆర్టీసీ బస్సుల్లోనే అమల్లో ఉన్న స్త్రీశక్తి పథకం

కొత్తగా ఏసీ బస్సులు కొనుగోలు చేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటన

కొత్త బస్సులు అందుబాటులోకి వచ్చిన తర్వాత అమలుపై స్పష్టత వచ్చే అవకాశం




2లో

## ఏపీ వైపు మల్లారెడ్డి చూపు!

విద్యా వ్యాపారాన్ని విస్తరించేందుకు ప్రయత్నం

క్యాంపస్లు, ఆఫ్ క్యాంపస్ లతో రంగంలోకి

దశాబ్దాలుగా పాతుకుపోయిన విద్యాసంస్థలకు గట్టి షాక్



2లో

## సిక్కోలులో కుల సమరం!

సామాజిక వర్గాల సమతుల్యంలో వైసీపీ విఫలం

ఈ విషయంలో అధిగమించిన కాంగ్రెస్, టిడిపి

ధర్మాన సోదరుల ఆధిపత్యం పై రగిలిపోతున్న తమ్మినేని

దువ్వాడ శ్రీనివాస్ తో కలిసి సొంత రాజకీయం

3లో








# ఖైరతాబాద్‌తో పాటు గ్రేటర్!




ప్రజాక్షేత్రంలోకి వెళ్లడమే ఒక ధైర్యవంతమైన నాయకత్వానికి నిదర్శనం. గతంలో ఎదురైన అడ్డంకులను అధిగమించి ముందుకు సాగిన అనుభవాలు ఉండగా.. కార్పొరేషన్ ఎన్నికల విషయంలో ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే నిస్తేజంగా వ్యవహరిస్తుందని భావన ప్రజల్లో బలపడుతోంది.

**ఊపు కోసం తప్పదు..**

దానం నాగేందర్ పై అనర్హత వేటుతో ఖైరతాబాద్ నియోజకవర్గానికి ఉప ఎన్నిక అనివార్యంగా మారింది. ఇటువంటి సమయంలో గ్రేటర్ రాజకీయాలు పతాక స్థాయికి చేరాయి. రాజధాని నడిబొడ్డున ఉన్న ఖైరతాబాద్ నియోజకవర్గ ఉప ఎన్నిక ముంచుకొస్తున్న తరుణంలో.. కార్పొరేషన్ల ఎన్నికలకు వెళ్లడం ద్వారా కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా భారీ ఊపును, సానుకూల వాతావరణాన్ని సృష్టించే సువర్ణ అవకాశమే. హైదరాబాద్లో పూర్వ వైభవం సాధించాలన్న భారత రాష్ట్ర సమితి ఆశలను, దూకుడు మీద ఉన్న బిజెపిని ఏకకాలంలో ఆత్మరక్షణలో నెట్టాలంటే గ్రేటర్ ఎన్నికలు సరైన అస్త్రం. నగర ఓటర్లను సమీకరించి ఉప ఎన్నికలతో పాటు కార్పొరేషన్ ఎన్నికలకు వెళితే.. రాజధానిపై పూర్తి పట్టు సాధించినట్టు అవుతుంది. అది రాష్ట్రవ్యాప్తంగా ప్రభావం చూపుతుంది.

**ఆ అనుమానం తోనే..**

సీఎం రేవంత్ తో పాటు కాంగ్రెస్ పార్టీకి అనుమానము చూపులు ఎంత మాత్రం సహేతుకం కాదు. నగరవాసులు తిరస్కరిస్తారన్న భావన వారికి ఉన్నట్టు ఉంది. కానీ ఒక అజెండాగా తీసుకుని.. అసెంబ్లీతోపాటు సార్వత్రిక ఎన్నికల ముంగిట గ్రేటర్ రిస్క్ చేస్తే వచ్చే ఫలితం బట్టి తన పాలనా తీరును, తన రాజకీయ దృక్పథాన్ని రేవంత్ మార్చుకునేందుకు అవకాశం కలుగుతుంది. కానీ రేవంత్ మాత్రం ఆ సాహసానికి దిగడం లేదు. ఒకవేళ ఆ సాహసానికి దిగి సక్సెస్ అయితే తెలంగాణలో రేవంత్ ను ఆపేవారు లేరు. అయితే ఆ రిస్క్ తీసుకునేందుకు మాత్రం రేవంత్ ముందుకు రావడం లేదు. అయితే ఈ రోజు కాకుంటే రేపైనా గ్రేటర్ ఎన్నికలకు వెళ్లి.. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు వెళ్లాల్సి ఉంటుంది. అందుకే ఇప్పుడే తాడోపేడో తేల్చుకుంటే చాలా మంచిది.

# ఏపీ వైపు మల్లారెడ్డి చూపు!



**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** మల్లారెడ్డి ఏపీ పై దృష్టి పెట్టారా? ఏపీలో తన సామ్రాజ్యాన్ని విస్తరించాలని భావిస్తున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. తెలంగాణలో బలమైన ఇంజనీరింగ్, మెడికల్, ప్రైవేటు విశ్వవిద్యాలయ వ్యవస్థను నిర్మించారు మల్లారెడ్డి. ఇప్పుడు తన దృష్టిని ఏపీ వైపు సారిస్తున్నారు. తెలంగాణలో మల్లారెడ్డి యూనివర్సిటీ తో పాటు డిమ్డు యూనివర్సిటీ హోదాతో విద్యారంగాన్ని ఏలింది మల్లారెడ్డి గ్రూప్. ఇప్పుడు ఏపీలో సైతం తన విద్యా వ్యాపారాన్ని అత్యంత వేగంగా విస్తరిస్తోంది. ఏపీలోని ప్రధాన నగరాలు, ఉమ్మడి జిల్లాలను లక్ష్యంగా చేసుకుని రీజనల్ క్యాంపస్లు, సాటిలైట్ క్యాంపస్లు, ఆఫ్ క్యాంపస్ సెంటర్ల ఏర్పాటుకు మల్లారెడ్డి విద్యా సంస్థల యాజమాన్యాలు ప్రణాళికలు వేగవంతం చేశాయి.

**విశాఖలో క్యాంపస్ ప్రారంభం..**

విశాఖ నగరంలో మల్లారెడ్డి డీమ్డ్ యూనివర్సిటీ ఆఫ్ క్యాంపస్ పేరుతో.. భారీ ఆఫ్ క్యాంపస్ సెంటర్ ను ఇప్పటికే ప్రారంభించారు. యు జి సి అనుమతులతో ఏర్పాటు చేసిన ఈ క్యాంపస్లో ఇంజనీరింగ్, మేనేజ్మెంట్, హెల్త్ కేర్ విభాగాల్లో అత్యాధునిక కోర్సులను ఆఫర్ చేస్తున్నారు. కేవలం విశాఖ మాత్రమే కాదు.. అమరావతి పరిధిలోని విజయవాడ, గుంటూరు రీజియన్లలో ఈ ఆఫ్ క్యాంపస్లు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు మొదలుపెట్టారు. రాయలసీమ కేంద్రమైన తిరుపతి, కర్నూలు జిల్లాల్లో కొత్త క్యాంపస్ ల నిర్మాణానికి భూముల సేకరణ, అనుమతుల ప్రక్రియను వేగంగా పూర్తి చేస్తున్నట్లు సమాచారం. తిరుపతిలో ఓ కాలేజీని కొనుగోలు చేసి ఆఫ్ క్యాంపస్ ను ప్రారంభించారు.

**మార్కెటింగ్ ఆయుధంగా..**

అనతి కాలంలోనే మల్లారెడ్డి విద్యాసంస్థల విస్తరణ వెనుక.. మార్కెటింగ్ అనేది ప్రధాన భూమిక పోషించింది. ఏపీ ప్రభుత్వం ప్రైవేటు విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యాసంస్థల స్థాపనకు ఇస్తున్న ప్రోత్సాహకాలు మల్లారెడ్డి గ్రూప్ నకు కలిసి వచ్చే అంశాలు. ఏపీకి చెందిన వేలాదిమంది విద్యార్థులు ఏటా తెలంగాణలో మల్లారెడ్డి విద్యాసంస్థల్లో చేరుతున్నారు. అందుకే ఏపీలో క్యాంపస్ లను విస్తరిస్తే.. భారీగా అడ్మిషన్లు ఉంటాయని భావిస్తోంది మల్లారెడ్డి యాజమాన్యం. పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా ఏఐ, డేటా సైన్స్, పారామెడికల్, లైఫ్ సైన్సెస్ కోర్సులపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఏపీ విద్యార్థులను ఆకట్టుకునే వ్యూహంతో అడుగులు వేస్తోంది.

**నెట్వర్క్ విస్తరణ..**

ఏపీలో దశాబ్దాలుగా చాలా విద్యాసంస్థలు పాతుకుపోయాయి. వాటన్నింటికి ఇప్పుడు మల్లారెడ్డి విద్యాసంస్థలు గట్టి పోటీ ఇవ్వనున్నాయి. మల్లారెడ్డి దూకుడు చూస్తుంటే ఏపీలో అగ్రెసివ్ నెట్వర్క్ విస్తరణ అన్నట్టు ఉంది. ఏపీలో సంప్రదాయ ప్రైవేట్ కాలేజీలు, కార్పొరేట్ విద్యాసంస్థలకు గట్టి పోటీ ఎదురు కాబోతోంది. పొలిటికల్ ఇమేజ్, బ్రాండ్ మార్కెటింగ్, తక్కువ ఫీజు తో కూడిన హామీలు, ప్లేస్మెంట్స్ నెట్వర్క్ ను చూపించి ఏపీ ఉన్నత విద్యా మార్కెట్లో తమ ఆధిపత్యాన్ని నిలుపుకోవాలని మల్లారెడ్డి గ్రూపు లక్ష్యంగా పెట్టుకుంది. రాబోయే రెండు మూడేళ్లలో ఏపీలోని ప్రధాన జిల్లాలన్నింటికీ తమ విద్యా నెట్వర్క్ విస్తరించి.. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో తిరుగులేని విద్యా సామ్రాజ్యంగా ఎదగడమే లక్ష్యంగా మల్లారెడ్డి ప్రణాళికలను అమలు చేస్తున్నారు.. మరి ఈ ప్రయత్నం ఎంతవరకు వర్కౌట్ అవుతుందో చూడాలి.

## కేసీఆర్ కట్టినవాటికి రేవంత్ రిబ్బన్లు కట్ చేస్తున్నారు: కౌశిక్ రెడ్డి

**రేవంత్ రెడ్డి ఒక రిబ్బన్ కటింగ్ సీఎం అని పాడి కౌశిక్ రెడ్డి విమర్శ**

**సిరిసిల్లలో కేటీఆర్ చేసిన అభివృద్ధిలో 10 శాతం కొడంగల్‌లో చేయాలని సవాల్**

**రెండేళ్లలో మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని ధీమా**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ... రేవంత్ రెడ్డి ఒక 'రిబ్బన్ కటింగ్ సీఎం' అంటూ ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్మించిన కట్టడాలకే రేవంత్ రెడ్డి రిబ్బన్లు కత్తిరిస్తున్నారని ఆరోపించారు. "కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తానని చెప్పిన రేవంత్, ఇప్పుడు ఆయన కట్టిన వాటినే ప్రారంభిస్తున్నారు. కరీంనగర్ కలెక్టరేట్ కేసీఆర్ ఆనవాళ్లు కాదా?" అని కౌశిక్ రెడ్డి ప్రశ్నించారు. సిరిసిల్లలో కాంగ్రెస్ ఏర్పాటు చేసిన సభకు ప్రజల నుంచి స్పందన లేదని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ఆయన ఓ సవాల్ విసిరారు. సిరిసిల్లలో ఎమ్మెల్యే కేటీఆర్ చేసిన అభివృద్ధిలో కనీసం 10 శాతం అయినా తన సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లో చేసి చూపించాలని అన్నారు. ముఖ్యమంత్రి సొంత గ్రామంలోనే కరెంట్ సరఫరా సరిగా లేదని ఎద్దేవా చేశారు. "తెలంగాణలో కాంగ్రెస్ తల్లిని నిలబెట్టారు. రెండేళ్లలో మళ్లీ కేసీఆర్ సీఎం అవుతారు.

# జగన్ కాంగ్రెస్‌లోకి వస్తే?

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న పాత కాంగ్రెస్ నేతలు తిరిగి సొంత పార్టీలోకి రావాలని ఆయన బహిరంగంగా పిలుపునిచ్చారు. వైఎస్ జగన్, మమతా బెనర్జీ, శరద్ పవార్ వంటి నేతలు తిరిగి వస్తే తానే అందరికంటే ఎక్కువ సంతోషిస్తానని భట్టి పేర్కొన్నారు. కొచ్చిలో జరిగిన ఇండియా టుడే కాంక్లేవ్ సౌత్--2026లో భట్టి పాల్గొన్న సెషన్‌లో ఈ వ్యాఖ్యలు చేశారు.

**జగన్ పేరుతో భట్టి ఏం చెప్పారు?**

వైఎస్ రాజశేఖరరెడ్డితో కలిసి పనిచేసిన రోజులను భట్టి ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. జగన్‌తో తనకు నేరుగా పనిచేసిన అనుభవం లేకపోయినా.. గతంలో కాంగ్రెస్‌తో అనుబంధం ఉన్న నేతలు తిరిగి పార్టీలోకి వస్తే పార్టీ సిద్ధాంతాలను, దేశాన్ని బలోపేతం చేయడంలో భాగస్వాములు అవుతారని వ్యాఖ్యానించారు. అయితే జగన్ కాంగ్రెస్‌లో చేరుతున్నారని భట్టి ప్రకటించలేదు. ఇప్పటికే జరుగుతున్న రాజకీయ ప్రచారం మధ్య.. కాంగ్రెస్‌ను గతంలో వీడిన నేతలు తిరిగి వస్తే స్వాగతిస్తాననే తన అభిప్రాయాన్ని ఆయన వెల్లడించారు. జగన్ మాత్రమే కాకుండా మమతా బెనర్జీ, శరద్ పవార్ వంటి మాజీ కాంగ్రెస్ నేతల పేర్లను కూడా ప్రస్తావించడం ఈ వ్యాఖ్యలకు ప్రాధాన్యం తెచ్చింది.

**రేవంత్‌తో విభేదాలున్నాయా?**

తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి, తన మధ్య ఎలాంటి విభేదాలు లేవని భట్టి స్పష్టం చేశారు. ప్రభుత్వ నిర్ణయాలను సమష్టిగా తీసుకుంటున్నామని చెప్పారు. నేతలను కేవలం కులం కోణంలో చూడటం సరికాదని.. తామిద్దరం కలిసి ప్రభుత్వాన్ని నడుపుతున్నామని వివరించారు. తెలంగాణలో ప్రభుత్వం పని చేసే విధానం విషయంలో కూడా తన వైఖరిని భట్టి వివరించారు. వ్యక్తిగత భేదాల కంటే ప్రభుత్వ లక్ష్యాలు, ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకే ప్రాధాన్యం ఇస్తున్నామని ఆయన చెప్పారు.

**"తెలంగాణకు వచ్చేది 43 పైసలే"**

కేంద్ర--రాష్ట్ర సంబంధాలపైనా భట్టి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ నుంచి కేంద్రానికి పన్నుల రూపంలో వెళ్తున్న ప్రతి రూపాయికి బదులుగా రాష్ట్రానికి 43 పైసలు మాత్రమే తిరిగి వస్తున్నాయని ఆయన ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాల పట్ల కేంద్రం వివక్ష చూపుతోందని, ఇది సమాఖ్య వ్యవస్థ స్ఫూర్తిని దెబ్బతీస్తోందని విమర్శించారు. కేంద్రం నుంచి రాష్ట్రాలకు నిధుల పంపిణీ, దక్షిణాది రాష్ట్రాల వాటా వంటి అంశాలు కొంతకాలంగా రాజకీయ చర్చలో ఉన్నాయి. భట్టి కూడా ఇదే అంశాన్ని ప్రస్తావిస్తూ తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించారు.

**ఓటర్ల జాబితాపై మరోసారి ఫైర్**

ఓటర్ల జాబితా సవరణ అంశాన్ని కూడా భట్టి ప్రస్తావించారు. ఓటర్ల జాబితాలో అక్రమాలు జరుగుతున్నాయని, అవి బీజేపీకి ప్రయోజనం కలిగించే విధంగా ఉన్నాయని ఆయన ఆరోపించారు. ఈ నేపథ్యంలో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

# కేటీఆర్ అడ్డాలో రేవంత్ రచ్చ..

ఇంత పెద్ద మొత్తంలో ఆస్తులు ఎలా వచ్చాయో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. ఉద్యమం పేరుతో ఆస్తులు కూడబెట్టుకున్నారంటూ ఆయన ఆరోపించారు. హైదరాబాద్ హైటెక్ సిటీ పరిసరాల్లోని స్టార్ హోటళ్ల విషయంలోనూ సీఎం సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ కుటుంబ సభ్యుల పేర్లపై అలాంటి ఆస్తులు లేవని చెప్పగలరా అంటూ ప్రశ్నించారు. తన ఆరోపణలను నిరూపిస్తానని, నిరూపించలేకపోతే తన పేరే మార్చుకుంటానని సభా వేదికగా సవాల్ చేసినట్లు తాజా రాజకీయ నివేదికలు పేర్కొంటున్నాయి. అయితే ఇవన్నీ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన రాజకీయ ఆరోపణలు మాత్రమే. వాటిపై కేసీఆర్ లేదా బీఆర్ఎస్ నుంచి వచ్చే పూర్తి స్పందన ఆధారంగా ఆరోపణలు--ప్రత్యారోపణలపై మరింత స్పష్టత రావాల్సి ఉంటుంది.

**సిరిసిల్లలో కేటీఆర్‌నే టార్గెట్ చేస్తూ..**

సిరిసిల్ల నియోజకవర్గం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతం. సీఎం రేవంత్‌రెడ్డి సెప్టెంబర్ 30న సిరిసిల్లలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ముందుగానే ప్రకటించగా.. దానిపై రాజకీయంగా కూడా ఆసక్తి నెలకొంది. సభలో రేవంత్ నేరుగా కేటీఆర్‌ను కూడా ప్రస్తావించారు. సిరిసిల్ల ప్రజల గురించి గత పాలకులు ఏం చేశారంటూ ప్రశ్నించారు. ముఖ్యంగా చేనేత, పవర్‌లూమ్ రంగంపై ఆధారపడిన కుటుంబాల పరిస్థితిని ప్రస్తావిస్తూ బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని విమర్శించారు. "సిరిసిల్ల ప్రజల గురించి కేటీఆర్ ఏనాడైనా ఆలోచించారా?" అంటూ సీఎం ప్రశ్నించారు. సిరిసిల్లను గత పాలనలో 'ఉరిసిల్ల'గా మార్చారని ఆరోపించారు.

**చేనేత కుటుంబాల సమస్యలపై ఫోకస్**

సిరిసిల్ల అంటే తెలంగాణలో చేనేత, పవర్‌లూమ్ పరిశ్రమలకు ప్రత్యేక గుర్తింపు ఉన్న ప్రాంతం. వేలాది కుటుంబాలు వస్త్ర ఉత్పత్తిపై ఆధారపడి జీవిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సీఎం తన ప్రసంగంలో చేనేత కార్మికుల అంశాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. సిరిసిల్లకు సంబంధించిన అభివృద్ధి పనులపై ప్రభుత్వం దృష్టి పెడుతోందని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతోంది. సెప్టెంబర్ 30న సీఎం పర్యటనలో సుమారు రూ.345.78 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేపట్టే కార్యక్రమం కూడా ఉంది. ఇందులో విద్య, మౌలిక వసతులు, మహిళా సాధికారత, చేనేత రంగానికి సంబంధించిన అంశాలు ఉన్నాయి. ఇదే సమయంలో కేటీఆర్ కూడా సీఎం పర్యటనకు ముందే సిరిసిల్ల అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చేనేత బకాయిలు, వీవర్స్ ఇన్సూరెన్స్, టెక్స్‌టైల్ పార్క్, రైతు సమస్యలపై ప్రభుత్వం స్పష్టమైన వివరాలు ఇవ్వాలని కోరారు.

**8 వేల ఎకరాల భూములపై ఇప్పటికే మాటల యుద్ధం**

సిరిసిల్లలో భూముల అంశం కూడా కొంతకాలంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య ప్రధాన రాజకీయ వివాదంగా మారింది. సిరిసిల్లలో సుమారు 8 వేల ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని రేవంత్‌రెడ్డి ఆరోపించగా.. అందుకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రభుత్వం శ్వేతపత్రం రూపంలో విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. సర్వే నంబర్లు, గ్రామాలు, మండలాలు, భూముల విస్తీర్ణం, సంబంధిత వ్యక్తుల వివరాలను ప్రజల ముందు పెట్టాలని ఆయన కోరారు. అంతేకాదు.. ఆరోపణలు నిజమైతే ఆధారాలు బయటపెట్టాలని, నిరూపించలేకపోతే సీఎం ప్రజలకు క్షమాపణ చెప్పాలని కేటీఆర్ సవాల్ చేశారు.

# మహిళలకు ఫ్రీ జర్నీ..

ఏపీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై మరో కీలక అప్డేట్ వచ్చింది. ఇప్పటివరకు సాధారణ సర్వీసులకే పరిమితమైన స్త్రీశక్తి పథకం పరిధిని భవిష్యత్తులో ఏసీ బస్సులకూ విస్తరించే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన తాజా ప్రకటనతో.. ఏసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ఎప్పటి నుంచి అందుబాటులోకి వస్తుందనే ఆసక్తి మహిళల్లో నెలకొంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని అమలు చేస్తోంది. అయితే ఈ పథకం అన్ని రకాల బస్సులకు వర్తించడం లేదు. ప్రస్తుతం పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ వంటి సర్వీసుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణిస్తున్నారు. అదే సమయంలో సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్, ఏసీ, నాన్-ఏసీ స్లీపర్ బస్సులు, తిరుమల--తిరుపతి మధ్య నడిచే సప్తగిరి సర్వీసులు, నాన్‌స్టాప్, అంతరాష్ట్ర బస్సులకు ప్రస్తుతం స్త్రీశక్తి పథకం వర్తించడం లేదు. ఏసీ బస్సులపై చంద్రబాబు కీలక ప్రకటన విజయవాడలో బుధవారం నిర్వహించిన పేదలకు పట్టాభిషేకం కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 26,400 మంది పేదలకు ఇళ్ల పట్టాలను అందించారు. అనంతరం మాట్లాడిన ఆయన.. పేదల సంక్షేమం, మహిళలకు అందుతున్న సౌకర్యాలపై పలు అంశాలను ప్రస్తావించారు. కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన స్త్రీశక్తి పథకాన్ని ప్రస్తావిస్తూ.. భవిష్యత్తులో మహిళల కోసం ఏసీ బస్సులను కూడా కొనుగోలు చేస్తామని చంద్రబాబు ప్రకటించారు. దీంతో ప్రస్తుతం ఉచిత ప్రయాణానికి దూరంగా ఉన్న ఏసీ సర్వీసుల్లోనూ మహిళలకు ఈ సదుపాయం అందుబాటులోకి వచ్చే అవకాశం ఏర్పడింది. ఇదే ఇప్పుడు మహిళల్లో ప్రధానంగా వినిపిస్తున్న ప్రశ్న. అయితే తాజా ప్రకటనలో ఏసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని అమలు చేసే కచ్చితమైన తేదీని ప్రభుత్వం ప్రకటించలేదు. కొత్త ఏసీ బస్సులను కొనుగోలు చేసి, వాటిని అందుబాటులోకి తీసుకొచ్చిన తర్వాత ఈ సదుపాయాన్ని అమలు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. అంటే.. ప్రస్తుతం ఉన్న ఏసీ బస్సులన్నింటికీ వెంటనే స్త్రీశక్తి పథకాన్ని వర్తింపజేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించలేదు.

## ఒకే రోజు రెండు గోల్డ్ మెడల్స్.. తెలంగాణ ఆర్చర్ చికితకు సీఎం రేవంత్ అభినందనలు

**ఆసియా క్రీడల్లో చికితకు రెండు స్వర్ణ పతకాలు**

**కాంపౌండ్ ఉమెన్స్ టీమ్, మిక్స్‌డ్ టీమ్‌లో అద్భుత ప్రదర్శన**

**సాహిల్ జాదవ్‌తో కలిసి మిక్స్‌డ్ టీమ్‌లో స్వర్ణం**

**2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన చికిత**




**హైదరాబాద్, సెప్టెంబర్ 30:** ఒకే రోజు రెండు స్వర్ణ పతకాలు.. అంతర్జాతీయ వేదికపై తెలంగాణ క్రీడాకారిణి సత్తా.. రాబోయే ఒలింపిక్స్‌కు అర్హత! తెలంగాణకు చెందిన ఆర్చరీ క్రీడాకారిణి తానిపర్తి చికితా రావు ఆసియా క్రీడల్లో అద్భుత ప్రదర్శనతో వార్తల్లో నిలిచారు. కాంపౌండ్ ఉమెన్స్ టీమ్, మిక్స్‌డ్ టీమ్ విభాగాల్లో స్వర్ణ పతకాలు సాధించి సత్తా చాటారు. ఆమె విజయంపై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి స్పందిస్తూ అభినందనలు తెలిపారు.

**ఒకే రోజు.. రెండు స్వర్ణాలు:** ఆసియా క్రీడల్లో చికితా రావు సాధించిన ప్రదర్శన ప్రత్యేకంగా నిలిచింది. కాంపౌండ్ ఉమెన్స్ టీమ్ ఈవెంట్‌లో ఒక స్వర్ణం, అనంతరం మిక్స్‌డ్ టీమ్ విభాగంలో మరో స్వర్ణం సాధించారు. మిక్స్‌డ్ టీమ్ విభాగంలో చికిత తన భాగస్వామి సాహిల్ జాదవ్‌తో కలిసి బంగారు పతకం సాధించారు. వరుస విజయాలతో ఆమె అంతర్జాతీయ ఆర్చరీ వేదికపై తన ప్రతిభను మరోసారి చాటుకున్నారు. చికిత విజయాల్లో మరో ప్రత్యేకత ఉంది. మిక్స్‌డ్ టీమ్‌లో సాధించిన విజయంతో ఆమె 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించారు. ఆసియా వేదికపై స్వర్ణం సాధించడంతో పాటు ఒలింపిక్స్ బెర్త్ దక్కించుకోవడం ఆమె కెరీర్‌లో కీలక ఘట్టంగా మారింది. ఈ విజయంతో తెలంగాణకు చెందిన మరో క్రీడాకారిణి అంతర్జాతీయ స్థాయిలో తన ముద్ర వేయడం పట్ల క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**"తెలంగాణకు గర్వకారణం".. రేవంత్ రెడ్డి:** చికితా రావు విజయంపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. తన 'ఎక్స్' ఖాతా ద్వారా ఆమెకు అభినందనలు తెలిపారు. ఒకే రోజు రెండు స్వర్ణ పతకాలు సాధించడం ద్వారా చికిత తెలంగాణకు గర్వకారణంగా నిలిచారని పేర్కొన్నారు. చికిత పట్టుదల, నిరంతర సాధన, దృఢ సంకల్పం ఇతర యువ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలుస్తాయని సీఎం అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ పేరును నిలబెట్టినందుకు ఆమెను అభినందించారు.

# సిక్కోలులో కుల సమరం!

(మొదటి పేజీ తరువాయి)



**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** ఉత్తరాంధ్రలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి పరిస్థితి రోజురోజుకు దిగజారుతోంది. విజయనగరంలో చిన్న శ్రీను పార్టీకి గుడ్ బై చెప్పడంతో తీవ్ర సంక్షోభం నెలకొంది. ఇప్పుడు శ్రీకాకుళం జిల్లాలో కూడా అదే పరిస్థితి ఉంది. ధర్మాన సోదరులకు వ్యతిరేకంగా తమ్మినేని సీతారాం పావులు కదుపుతున్నారు. వైసిపి నుంచి సస్పెన్షన్కు గురైన దువ్వాడ శ్రీనివాస్ తో జత కలిశారు. దీంతో వారిద్దరూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి గట్టి సవాల్ విసురుతున్నారు. తమను నిర్లక్ష్యం చేస్తే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి భారీ దెబ్బ ఖాయమని తేల్చి చెబుతున్నారు. ఇద్దరూ ఇప్పుడు కలిసి తిరుగుతుండడం.. కలిసి ప్రకటనలు చేస్తుండడం హాట్ టాపిక్ అవుతుంది. కుల అంశాన్ని తెరపైకి తెచ్చి పోరాటం చేయడానికి ఇరువురి నేతలు నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.

**అన్ని కులాలకు ప్రాధాన్యం..**

శ్రీకాకుళం జిల్లా రాజకీయ పరిస్థితులు ఒకసారి గమనిస్తే.. కాంగ్రెస్ తో పాటు తెలుగుదేశం ప్రధాన కులాలను సమ ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగాయి. కానీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మాత్రం కుల రాజకీయాలను సర్దుబాటు చేసుకోలేక సతమతం అవుతుంది. టిడిపి నాలుగు దశాబ్దాల రాజకీయంలో ఎప్పుడు ఇలాంటి సమస్యలు ఎదుర్కోలేదు. వాస్తవానికి ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో గత దశాబ్ద కాలంగా వెలమలది రాజకీయ ఆధిపత్యం. అయినా సరే మిగిలిన సామాజిక వర్గాలను చేరదీస్తూ టిడిపి ముందుకు సాగింది. ఆ రకమైన అసంతృప్తి కులాల మీద పడనీయకుండా జాగ్రత్త పడుతోంది. వైసిపి అధికారంలో ఉన్నప్పుడు ఈ సమీకరణలు సరిచేసుకుంది. కానీ ఓటమి తర్వాత మాత్రం పరిస్థితి చేయి దాటుతోంది. అంతిమంగా అది పార్టీకి నష్టం చేకూర్చేలా ఉంది.

**తమ్మినేనిది గొప్ప ప్రస్థానం..**

జిల్లా రాజకీయాల్లో తమ్మినేని సీతారాం ది ప్రత్యేక స్థానం. 1983 నుంచి వరుసగా ఐదు సార్లు గెలిచారు. రెండుసార్లు మంత్రి కూడా అయ్యారు. వైసీపీ నుంచి ఒకసారి గెలిచి శాసనసభ స్పీకర్ అయ్యారు. గతంలో కాలింగ సామాజిక వర్గానికి చెందిన బొడ్డేపల్లి రాజగోపాల్ రావు సుదీర్ఘకాలం శ్రీకాకుళం ఎంపీగా పనిచేశారు. కాంగ్రెస్లో కాలింగ్ లకు ప్రాధాన్యం ఉండేది. తరువాత వెలమల ప్రాధాన్యం పెరిగింది. టిడిపి సైతం కాలింగ్ ఇస్తూనే వెలమలకు కూడా కీలక పదవులు కట్టబెట్టింది. కానీ వైసీపీ మాత్రం ఆ రెండు వర్గాలను దగ్గరకు తీసుకునే క్రమంలో ఎక్కడో సమతుల్యత కొరవడింది. ఫలితంగా ఇప్పుడు కాళింగ సామాజిక వర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపై తీవ్ర ఆగ్రహంతో రగిలిపోతోంది..

**ఆ ఇద్దరూ ఒక్కటై..**

కొద్ది నెలల కిందట కుటుంబ వివాదంతో పార్టీ నుంచి సస్పెన్షన్కు గురయ్యారు ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్. అటు తరువాత తమ్మినేని సీతారాం కు ప్రాధాన్యత తగ్గింది. మరో కీలక నేత, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి సామాజిక ఆధిపత్య పోరుతోనే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడారు. జిల్లాలో ధర్మాన సోదరులు చెప్పినట్లుగానే పార్టీ నడుస్తోంది అనే భావన కాళింగ సామాజిక వర్గంలో బలపడుతోంది. దీనిపై హై కమాండ్ కు ఫిర్యాదు చేస్తే వారు పట్టించుకున్న దాఖలాలు లేవు. అందుకే సొంత అజెండాతో తమ్మినేని సీతారాం, దువ్వాడ శ్రీనివాస్ రాజకీయంగా ముందుకు వెళ్లాలని నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో..

## బొగ్గు మనది.. నీళ్లు మనవి.. కరెంటు మాత్రం రాజస్థాన్‌కా?

హైదరాబాద్, సెప్టెంబర్ 30: తెలంగాణ విద్యుత్ రాజకీయాలు మరోసారి వేడెక్కాయి. సొంత రాష్ట్రంలో విద్యుత్ అవసరాలు, రైతులకు సరఫరా, థర్మల్ ప్లాంట్లలో ఉత్పత్తి అంశాలు చర్చనీయాంశంగా ఉన్న సమయంలో.. సింగరేణి నుంచి రాజస్థాన్‌కు విద్యుత్ కేటాయించే ప్రతిపాదనను రద్దు చేయాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ నుంచి ఉత్పత్తి కానున్న 800 మెగావాట్ల విద్యుత్‌ను ఇతర రాష్ట్రానికి ఇవ్వడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. హరీశ్‌రావు తన లేఖలో ప్రధానంగా తెలంగాణ వనరుల అంశాన్ని ప్రస్తావించారు. మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్టుకు అవసరమైన బొగ్గు సింగరేణి గనుల నుంచే వస్తుందని, నీటి వనరు గోదావరి కాగా.. ప్రాజెక్టు ఉన్న భూమి కూడా తెలంగాణదేనని పేర్కొన్నారు. అలాంటి పరిస్థితుల్లో అక్కడ ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను తెలంగాణ అవసరాలకు కాకుండా రాజస్థాన్‌కు కేటాయించడంపై ఆయన ప్రశ్నించారు. "బొగ్గు మనది.. నీళ్లు మనవి.. స్థలం మనది.. కానీ విద్యుత్ మాత్రం రాజస్థాన్‌కా?" అంటూ ప్రభుత్వాన్ని నిలదీశారు. ఈ వ్యవహారంలో ప్రతిపాదిత జాయింట్ వెంచర్ ఒప్పందాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణి సంస్థ నుంచి దాదాపు రూ.22 వేల కోట్ల పెట్టుబడిని రాజస్థాన్ ప్రాజెక్టుకు మళ్లించే అంశంపైనా హరీశ్‌రావు అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలంగాణకు చెందిన ప్రభుత్వ రంగ సంస్థ నిధులను ఇతర రాష్ట్రంలో పెట్టుబడిగా పెట్టాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. తక్కువ వ్యయంతో విద్యుత్ ఉత్పత్తి చేయగల సింగరేణి సామర్థ్యాన్ని ముందుగా తెలంగాణ అవసరాలకు ఉపయోగించాలని ఆయన కోరారు. అయితే ఇది హరీశ్‌రావు చేసిన రాజకీయ అభ్యంతరం కాగా, ప్రతిపాదిత ఏర్పాటుకు సంబంధించిన పూర్తి ఒప్పంద నిబంధనలు, విద్యుత్ కొనుగోలు విధానం వంటి అంశాలపై ప్రభుత్వం నుంచి అధికారిక వివరణ రావాల్సి ఉంది.

## పేరు మారితే అంతా మారిపోతుందా? కేటీఆర్



హైదరాబాద్, సెప్టెంబర్ 30: తెలంగాణ రాజకీయాల్లో పార్టీ పేర్ల మార్పు నుంచి వచ్చే ఎన్నికల నాయకత్వం వరకు ఆసక్తికర చర్చ సాగుతున్న వేళ.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు మరోసారి రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీశాయి. పార్టీ పేరు టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్‌గా మారినంత మాత్రాన తమ రాజకీయ సిద్ధాంతం, ఆలోచనా విధానం, నాయకత్వంలో ఎలాంటి మార్పూ రాలేదని ఆయన స్పష్టం చేశారు. పేరు మారినా 'డీఎన్ఏ' మారలేదన్నదే తమ వైఖరి అని చెప్పారు.

**"పేరు మార్చుకుంటే వ్యక్తి మారిపోతారా?"**

ఇండియా టుడే కాన్క్లేవ్ సౌత్ 2026లో పాల్గొన్న కేటీఆర్.. టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్‌గా పార్టీ పేరు మార్చడంపై మాట్లాడారు. తెలంగాణలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి నమూనాను ఇతర రాష్ట్రాలకు కూడా తీసుకెళ్లాలనే ఆలోచనతోనే జాతీయ విస్తరణ లక్ష్యంగా పేరు మార్చినట్లు వివరించారు. ఇదే విషయాన్ని వివరించేందుకు ఆయన సినిమాను ఉదాహరణగా తీసుకున్నారు. తన పేరును 'షారుఖ్ ఖాన్'గా మార్చుకుంటే తాను నిజంగానే బాలీవుడ్ నటుడు షారుఖ్ ఖాన్ అయిపోతానా? అంటూ ప్రశ్నించారు. పేరు మాత్రమే మారితే వ్యక్తిత్వం, ఆలోచనలు, అసలు స్వరూపం మారవన్నది ఆయన చెప్పిన భావన.

**తెలంగాణ మోడల్‌ను దేశానికి తీసుకెళ్లాలనుకున్నాం.....**

తెలంగాణలో తమ ప్రభుత్వం అమలు చేసిన పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను దేశంలోని ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లాలన్న ఉద్దేశంతోనే పార్టీ పేరును బీఆర్ఎస్‌గా మార్చినట్లు కేటీఆర్ చెప్పారు. అంటే పేరు మార్పు వెనుక కేవలం రాజకీయ బ్రాండింగ్ మాత్రమే కాకుండా.. తెలంగాణ అనుభవాలను జాతీయ స్థాయిలో ప్రస్తావించాలన్న లక్ష్యం కూడా ఉందని ఆయన వివరించారు. అయితే 2023 అసెంబ్లీ ఎన్నికల్లో అధికారాన్ని కోల్పోయిన తర్వాత బీఆర్ఎస్ రాజకీయ భవిష్యత్తుపై వస్తున్న ప్రశ్నలకు కూడా కేటీఆర్ తనదైన శైలిలో సమాధానం ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ తరఫున సీఎం ముఖం తానేనా? అన్న ప్రశ్నకు మాత్రం స్పష్టంగా 'కాదు' అని చెప్పారు.

**"కేసీఆరే మా సీఎం అభ్యర్థి"**

వచ్చే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీకి కేసీఆర్‌నే ముఖ్యమంత్రి అభ్యర్థిగా కేటీఆర్ ప్రకటించారు. బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. 2023లో ఓటమి ఎదురైనా.. తదుపరి ఎన్నికల్లో తమ పార్టీ పుంజుకుంటుందని చెప్పారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై కూడా కేటీఆర్ విమర్శలు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి దాదాపు మూడేళ్లు అవుతున్నప్పటికీ ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని ఆయన ఆరోపించారు. ప్రజలు గత ప్రభుత్వాన్ని గుర్తు చేసుకుంటున్నారని, ప్రస్తుత పాలనపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. ఇవి కేటీఆర్ చేసిన రాజకీయ అంచనాలు, వ్యాఖ్యలేనని గమనించాలి.

**బీజేపీతో పొత్తు ఉండదని స్పష్టత**

బీజేపీతో బీఆర్ఎస్ పొత్తు పెట్టుకునే అవకాశాలపై కూడా కేటీఆర్ స్పష్టత ఇచ్చారు. రెండు పార్టీల సిద్ధాంతాలు వేర్వేరని, తమ పార్టీ ఏర్పడిన తర్వాత ఇప్పటివరకు బీజేపీతో పొత్తు పెట్టుకోలేదని చెప్పారు. 2014, 2018, 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒంటరిగానే పోటీ చేసిందని ఆయన గుర్తుచేశారు.

**రాముడు--శివుడి వ్యాఖ్యలపై రేవంత్‌పై విమర్శలు**

బీజేపీతో పాటు కాంగ్రెస్‌పైనా కేటీఆర్ విమర్శలు చేశారు. మత ప్రాతిపదికన సమాజంలో విభజనకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. అదే సమయంలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి రాముడిని, శివుడిని పూజించే ప్రజల మధ్య విభేదాలు సృష్టించేలా మాట్లాడుతున్నారని కేటీఆర్ విమర్శించారు. ఉద్యోగాలు, ఎన్నికల హామీల అమలు వంటి అసలు ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే ఇలాంటి అంశాలు ముందుకు వస్తున్నాయని ఆయన ఆరోపించారు. ఇవి కేటీఆర్ చేసిన రాజకీయ విమర్శలు; సంబంధిత పార్టీల నుంచి వచ్చే స్పందనను బట్టి దీనిపై పూర్తి రాజకీయ వాదనను అంచనా వేయాల్సి ఉంటుంది. ఇటీవల దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాల సవరణపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం పనితీరుపైనా కేటీఆర్ ప్రశ్నలు లేవనెత్తారు. తెలంగాణలో జరుగుతున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణపై బీఆర్ఎస్ అభ్యంతరాలు వ్యక్తం చేసిందని చెప్పారు.

## రెండు సీట్లు.. ఇద్దరూ రెడ్డిలేనా?

(మొదటి పేజీ తరువాయి)

రెండు ఎమ్మెల్సీ స్థానాలకు కాంగ్రెస్ ప్రకటించిన అభ్యర్థుల విషయంలో తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. రెండు స్థానాల్లోనూ ఒకే సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులను ఎంపిక చేయడాన్ని ఆమె ప్రశ్నించారు. సోషల్ మీడియా వేదికగా స్పందించిన కవిత.. ఇది సామాజిక ప్రాతినిధ్యంపై ఆలోచిం చాల్సిన అంశమని వ్యాఖ్యానించారు.

**రెండు స్థానాలకు కాంగ్రెస్ అభ్యర్థులు వీరే..**

రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ రెండు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. మహబూబ్‌నగర్--రంగారెడ్డి--హైదరాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి సామ రామ్మోహన్‌రెడ్డి, నల్గొండ--ఖమ్మం--వరంగల్ స్థానానికి రామిరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి పేర్లను పార్టీ ఖరారు చేసింది. ఇద్దరు అభ్యర్థులూ రెడ్డి సామాజిక వర్గానికి చెందినవారేనన్న అంశాన్ని ప్రస్తావిస్తూ కవిత కాంగ్రెస్ నిర్ణయంపై ప్రశ్నలు సంధించారు. రెండు స్థానాలకు రెండు టికెట్లు కూడా ఒకే వర్గానికి ఇవ్వడంపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థుల ప్రకటన అనంతరం కవిత సోషల్ మీడియా వేదికగా స్పందించారు. "రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ సీట్లు.. రెండు చోట్లా రెడ్డి నేతలకే టికెట్లు.. ఇది పూర్తి సామాజిక అన్యాయం కాదా?" అంటూ ప్రశ్నించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అన్ని సామాజిక వర్గాలకు తగిన ప్రాతినిధ్యం ఉండాలన్నది తన అభిప్రాయమని ఆమె పేర్కొన్నారు. అధికారంలో ఉన్న పార్టీ అభ్యర్థుల ఎంపికలో సామాజిక సమతుల్యతను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని కవిత వ్యాఖ్యానించారు.

**గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై ఆసక్తి**

సాధారణ ఎమ్మెల్సీ ఎన్నికలతో పోలిస్తే గ్రాడ్యుయేట్ నియోజకవర్గాల ఎన్నికల్లో పట్టభద్ర ఓటర్ల పాత్ర కీలకంగా ఉంటుంది. విద్యావంతుల సమస్యలు, ఉద్యోగాలు, నిరుద్యోగం, విద్యా రంగం, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, యువతకు అవకాశాలు వంటి అంశాలు ప్రచారంలో ప్రధానంగా ప్రస్తావనకు వస్తుంటాయి. అందువల్ల అభ్యర్థుల ఎంపిక నుంచి ప్రచార వ్యూహాల వరకు రాజకీయ పార్టీలు ప్రత్యేకంగా దృష్టి పెడుతున్నాయి. కాంగ్రెస్ రెండు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించడంతో ఇతర రాజకీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థుల వైపు కూడా ఇప్పుడు రాజకీయ వర్గాల దృష్టి మళ్లింది. రెండు స్థానాల్లోనూ రెడ్డి సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులను ఎంపిక చేయడం చుట్టూ కవిత లేవనెత్తిన ప్రశ్నలు రాజకీయ చర్చకు దారితీశాయి.

## ఇంటికి చేరుకోవడానికి ఇంకొన్ని నిమిషాలే..

**కానీ, మధ్యలోనే బస్సులో ప్రాణాలు విడిచిన మహిళ**

**గుండాల నుంచి ఇల్లందు వెళ్తున్న ఆర్టీసీ బస్సులో ఘటన**

**రొంపేడు వద్ద బస్సు దిగుతుండగా ఒక్కసారిగా స్పృహ కోల్పోయిన మహిళ**

**వెంటనే ఆసుపత్రికి తరలించిన బస్సు సిబ్బంది**

**గుండెపోటుతో మృతి.. భర్త, ఐదుగురు పిల్లలకు తీరని విషాదం**

**ఇల్లందు, సెప్టెంబర్ 30:** ఇంటికి చేరుకోవడానికి ఇంకొన్ని నిమిషాలే ఉంది. బస్సులో కూర్చుని తోటి ప్రయాణికులతో ఆమె సరదాగా మాట్లాడుకుంటున్నారు. రోజువారీ ప్రయాణంలాగే అంతా సాధారణంగానే సాగుతోంది. కానీ బస్సు గమ్యస్థానానికి చేరువయ్యే సమయంలో ఒక్కసారిగా ఆమె కుప్పకూలిపోయారు. ఏం జరిగిందో తెలుసుకునేలోపే పరిస్థితి విషాదంగా మారింది. ఇంటికి చేరాల్సిన ఆమె.. మార్గమధ్యంలోనే ప్రాణాలు కోల్పోయిన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో చోటుచేసుకుంది.

**కాసేపటి క్రితం వరకు కబుర్లు.. అంతలోనే..:** ఇల్లందు మండలం ధర్మారం తండాకు చెందిన లావత్ చిన్ని (48) గుండాల నుంచి ఇల్లందు వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్నారు. ముంబై తండా వద్ద బస్సు ఎక్కిన ఆమె.. తన గమ్యస్థానం వైపు వెళ్తున్నారు. బస్సులో ప్రయాణిస్తున్న సమయంలో ఆమె తోటి ప్రయాణికులతో మాట్లాడుకుంటూ సాధారణంగానే ఉన్నారు. ఎలాంటి అస్వస్థత కనిపించకపోవడంతో ప్రయాణికులు కూడా ఎలాంటి ఆందోళన చెందలేదు. మరికొద్దిసేపట్లో రొంపేడు వద్ద దిగాల్సి ఉంది. బస్సు రొంపేడు సమీపానికి చేరుకునే సమయంలోనే ఒక్కసారిగా ఆమె స్పృహ కోల్పోయి కుప్పకూలిపోయారు.

**వెంటనే స్పందించిన డ్రైవర్, కండక్టర్:** మహిళ ఒక్కసారిగా కుప్పకూలడంతో బస్సులో ఉన్నవారంతా ఆందోళనకు గురయ్యారు. వెంటనే బస్సు సిబ్బంది అప్రమత్తమయ్యారు. డ్రైవర్ నాగేశ్వరరావు, కండక్టర్ శ్రీనివాసులు ఆమెను రొంపేడు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వీలైనంత త్వరగా వైద్య సహాయం అందించేందుకు ప్రయత్నించినప్పటికీ.. అప్పటికే పరిస్థితి విషమంగా మారింది. వైద్యులు పరీక్షించి ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. వైద్యుల ప్రాథమిక నిర్ధారణ ప్రకారం గుండెపోటుతో ఆమె మృతి చెందినట్లు సమాచారం.

**కళ్లముందే ప్రాణాలు పోవడంతో..:** కొద్దిసేపటి క్రితం వరకు తమతో మాట్లాడిన మహిళ ఒక్కసారిగా స్పృహ కోల్పోయి ప్రాణాలు కోల్పోవడం తోటి ప్రయాణికులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. సాధారణంగా సాగుతున్న ప్రయాణం ఒక్కసారిగా విషాదంగా మారడంతో బస్సులో విషాద వాతావరణం నెలకొంది. ఇంటికి చేరుకుని కుటుంబ సభ్యులతో గడపాల్సిన సమయం దగ్గరపడుతున్న వేళ ఈ ఘటన జరగడం మరింత విషాదాన్ని మిగిల్చింది.

**ఐదుగురు పిల్లలకు తీరని లోటు:** చిన్ని మృతితో ధర్మారం తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆమెకు భర్తతో పాటు ఐదుగురు పిల్లలు ఉన్నారు. కుటుంబానికి ఆధారంగా ఉన్న ఆమె అకస్మికంగా మృతి చెందడంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. రోజువారీ పనులు ముగించుకుని ఇంటికి చేరుకోవాలనే సాధారణ ప్రయాణం.. కుటుంబ సభ్యులకు తీరని విషాదాన్ని మిగిల్చింది.

**పోలీసుల దర్యాప్తు:** ఈ ఘటనపై బస్సు సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి ఘటనకు సంబంధించిన వివరాలను పరిశీలిస్తున్నారు. మహిళకు గతంలో ఏమైనా అనారోగ్య సమస్యలు ఉన్నాయా? ప్రయాణంలో ఏ పరిస్థితుల్లో ఆమె స్పృహ కోల్పోయారు? తదితర అంశాలపై వివరాలు సేకరిస్తున్నారు. ఇంటికి చేరువలోనే ఇలా అనూహ్యంగా ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.




# భరత్‌నగర్ కాలనీ సమస్యలను పరిష్కరించాలి

## సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజనకు కాంగ్రెస్ నాయకుల వినతి



**కూకట్ పల్లి, సెప్టెంబర్ 30 (క్రైమ్ మిర్రర్) :** కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని భరత్‌నగర్ కాలనీతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్, బీ బ్లాక్ అధ్యక్షులు డాక్టర్ పి. నాగిరెడ్డి, తూము వేణు బుధవారం సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సృజనను మర్యాదపూర్వకంగా కలిశారు. భరత్‌నగర్ కాలనీలో నిర్వహించిన 'ఒక రోజు -- ఒక వార్డు' కార్యక్రమంలో కమిషనర్ పాల్గొన్న సందర్భంగా గుర్తించిన సమస్యలను సైతం నాయకులు మరోసారి ఆమె దృష్టికి తీసుకెళ్లారు. కాలనీలో అంతర్గత రహదారుల అభివృద్ధి, పారిశుద్ధ్య నిర్వహణ, వీధి దీపాల ఏర్పాటు, ప్రధాన రహదారిపై ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, తాగునీటి సరఫరా మెరుగుదలతో పాటు ఓవర్‌హెడ్ ట్యాంకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఆయా సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

**భరత్‌నగర్ ప్రధాన రహదారిపై ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి**

భరత్‌నగర్ కాలనీ నుంచి ఎంఎంటీఎస్, మెట్రో రైల్వే స్టేషన్లకు వెళ్లే మార్గాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో తీవ్ర ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతోందని నాయకులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, మహిళలు, ఉద్యోగులు, స్థానిక ప్రజలు ట్రాఫిక్ సమస్యల కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ పోలీసులతో సమన్వయం చేసుకుంటూ తగిన చర్యలు చేపట్టాలని కోరారు. భరత్‌నగర్ కాలనీతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు రాకపోకల్లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టి, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. కాలనీల్లో నెలకొన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని డాక్టర్ పి. నాగిరెడ్డి, తూము వేణు కోరారు.



## ఆల్విన్ కాలనీ డివిజన్ లేబర్ సెల్ జనరల్ సెక్రటరీగా పసునూరి రవీందర్ నియామకం

**నియామక పత్రాన్ని అందించిన పిఏసి చైర్మన్ అరికెపూడి గాంధీ**

**కూకట్ పల్లి, సెప్టెంబర్ 30 (క్రైమ్ మిర్రర్) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం, ఆల్విన్ కాలనీ డివిజన్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు పసునూరి రవీందర్ కి "తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ లేబర్ సెల్" ఆల్విన్ కాలనీ డివిజన్-- శేరిలింగంపల్లి నియోజకవర్గం జనరల్ సెక్రటరీగా నియామక ఉత్తర్వులు అందాయి. సందర్భంగా "ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు" పట్వారి శశిధర్ తో కలిసి "శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే, పిఏసి చైర్మన్ ఆర్కేపూడి గాంధీ ని మర్యాదపూర్వకంగా వారి కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా నియామక ఉత్తర్వుల లేఖను "ఎమ్మెల్యే" అరికెపూడి గాంధీ చేతుల మీదుగా స్వీకరించిన "పసునూరి రవీందర్" ని ఎమ్మెల్యే హృదయపూర్వకంగా అభినందించారు. ప్రజలు, కార్మికుల సమస్యలపై మరింత బాధ్యతతో పనిచేస్తూ, పార్టీకి మరింత సేవ చేయాలని సూచించారు. అలాగే భవిష్యత్తులో ప్రజాసేవలో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి మరిన్ని బాధ్యతలు, ఉన్నత పదవులు చేపట్టాలని హృదయపూర్వకంగా అభినందించారు. ఈ సందర్భంగా పట్వారి శశిధర్ మాట్లాడుతూ పసునూరి రవీందర్‌కు లభించిన ఈ బాధ్యత కార్మిక వర్గానికి మరింత సేవ చేసే అవకాశం అని, పార్టీ కోసం అంకితభావంతో పనిచేసి మంచి గుర్తింపు తెచ్చుకోవాలని అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగయ్య, శివ చారి, బొర్రా నాగేశ్వర్ రావు, శేఖర్, కిట్టు, బాబ్జి టీం పట్వారి తదితరులు పాల్గొన్నారు.

## పోషణ మాసం వార్షికోత్సవాలు



**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల మండలం వెలిమినేడు గ్రామంలో పోషణ మాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని సూచించారు. పోషకాహారంతో ఆరోగ్యం, శారీరక ఎదుగుదల మెరుగుపడుతుందని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సర్పంచ్ బొంతల చంద్రారెడ్డి, ఉప సర్పంచ్ అంతటి స్వప్న సత్తయ్య, ప్రధానోపాధ్యాయులు అరుణ ,శ్రీనివాసరావు అంగన్వాడి టీచర్లు పద్మ, సునీత, అండాలు ,ధనలక్ష్మి సెక్టార్ పరిధిలోని టీచర్లు మరియు పాఠశాల విద్యార్థు లు గర్భిణీలు బాలింతలు పాల్గొన్నారు

## సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులది కీలక పాత్ర



**నూతనకల్( క్రైమ్ మిర్రర్):** ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని పలు పాఠశాలల్లో ఉత్తమ సేవలను అందించిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు ఉపాధ్యాయులకు పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలు మెమెంటో సత్కరించారు.

కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు మార్గనిర్దేశం చేస్తూ, సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యారంగానికి చేసిన సేవలను స్మరించుకుంటూ ఆయన జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహించుకుంటున్నామని తెలిపారు. విద్యార్థులు ఉపాధ్యాయుల పట్ల తమ గౌరవాన్ని చాటుతూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నూతనకల్ గ్రామ సర్పంచ్ మహేశ్వరం మల్లికార్జున్ ఎంఈఓ రాముల్ నాయక్,శివయ్య, ఉప్పు నాగయ్య,సామ సవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బాలానగర్‌లో 'పౌర హక్కుల దినోత్సవం



**పౌర హక్కుల పరిరక్షణపై ప్రతి ఒక్కరిలో అవగాహన కలిగి ఉండాలి**

**ఎస్సీ, ఎస్టీ కేసులకు సంబంధించిన సమగ్ర వివరాల నివేదికను వెంటనే అందజేయాలని అధికారులకు సూచన**

**బాధితులకు అండగా ఉంటామని అధికారుల హామీ!**

**బాలానగర్, సెప్టెంబర్ 30 (క్రైమ్ మిర్రర్) :** తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు బాలానగర్ తహసీల్దార్ ఆధ్వర్యంలో బుధవారం రాజు కాలనీ కమ్యూనిటీ హాల్‌లో 'పౌర హక్కుల దినోత్సవం' (సివిల్ రైట్స్ డే) కార్యక్రమాన్ని నిర్వహించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) నాగమణి నేతృత్వంలో నిబంధనల ప్రకారం జరిగిన ఈ కార్యక్రమంలో బాలానగర్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) మనోహర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, స్థానిక దళిత నాయకులు పాల్గొన్నారు.

**చట్టాలపై అవగాహన.. సమస్యల పరిష్కారం:** ఈ సందర్భంగా ఆర్ఐ నాగమణి మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ చట్టాలు, పౌర హక్కుల పరిరక్షణపై ప్రతి ఒక్కరిలో అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని తెలిపారు. దళితులు, వెనుకబడిన వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలు, ఫిర్యాదులను స్వీకరించి, వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు రెవెన్యూ శాఖ కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. అలాగే, బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసులకు సంబంధించిన సమగ్ర వివరాల నివేదికను వెంటనే అందజేయాలని ఈ సందర్భంగా పోలీస్ అధికారులను ఆమె కోరారు.

**అస్పృశ్యత నివారణే లక్ష్యం:** సమాజంలో అసమానతలు, అస్పృశ్యత నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. బాధితులకు తగిన న్యాయం చేయడంతో పాటు, ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, అందుబాటులో ఉన్న చట్టపరమైన అవకాశాలపై అధికారుల బృందం స్థానికులకు సంపూర్ణ అవగాహన కల్పించింది.

## ఉద్యోగ విరమణ పొందిన తహసిల్దార్లకు ఘన సన్మానం





**ప్రజాసేవలో వారి సేవలు, విధి నిర్వహణలో నిబద్ధత ప్రశంసనీయం**

**సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 30:** ఉద్యోగ విరమణ పొందిన నాల్కల్ తహసిల్దార్ బి. ప్రభులు, చౌటకూర్ తహసిల్దార్ కిష్టయ్యలను సంగారెడ్డి కలెక్టరేట్‌లో అధికారులు, సిబ్బంది, తహసీల్దార్లు ఘనంగా సన్మానించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతీక్ జైన్ పదవీ విరమణ పొందిన తహసిల్దార్లను శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. అనంతరం వారికి ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ సహజమైన ప్రక్రియ అని పేర్కొన్నారు. ఉద్యోగ కాలంలో విధి నిర్వహణలో చూపిన నిబద్ధత, అంకితభావం, ప్రజలకు అందించిన సేవలే వారి సేవా ప్రస్థానానికి నిజమైన గుర్తింపు అని అన్నారు. బి. ప్రభులు, కిష్టయ్యలు తమ బాధ్యతలను నిబద్ధతతో, సమర్థవంతంగా నిర్వహించారని అభినందించారు. పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతూ, తమకు నచ్చిన వ్యాపకాలతో ప్రశాంతమైన, ఆరోగ్యకరమైన జీవితాన్ని కొనసాగించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు టి.ఎల్. సంగీత, ఆర్. పాండు, తహసీల్దార్లు, కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హాస్టల్ లో ఆకస్మిక తనిఖీ



**నూతనకల్ (క్రైమ్ మిర్రర్):** మండల కేంద్రంలోని బీసీ బాలుర హాస్టల్‌ను ఎంపీడీఓ సునీత ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో విద్యార్థులకు అందుతున్న భోజనం, తాగునీరు, పారిశుద్ధ్యం,వసతి సౌకర్యాలను పరిశీలించారు. హాస్టల్‌లోని వంటగది, భోజనశాల, విద్యార్థుల బాత్ రూమ్ లను,గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన, సమయానికి భోజనం అందించాలని తెలిపారు. హాజరు పట్టిక, స్టాక్ రిజిస్టర్లు, ఇతర రికార్డులను పరిశీలించి నిర్వహణపై వార్డెన్ అంజయ్య ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం కల్పిస్తున్న వసతులు వారికి పూర్తిస్థాయిలో అందేలా సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని ఎంపీడీఓ సూచించారు.



## నాంపల్లి లో వికసిత్ భారత్ ప్రణాళికలపై అవగాహన సదస్సు

**సోషల్ మ్యాప్, రిసోర్స్ మ్యాప్ ద్వారా గ్రామ అవసరాల గుర్తింపు.....**

**క్రైమ్ మిర్రర్, నాంపల్లి:** వికసిత్ భారత్ గ్రామ పంచాయతీ ప్రణాళిక (వీబీజీ-వీజీపీ)లో భాగంగా నాంపల్లి మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో స్థానిక సర్పంచ్ నక్క చంద్రశేఖర్ అధ్యక్షతన గ్రామంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం బుధవారం రోజున నిర్వహించారు. సోషల్ మ్యాప్, రిసోర్స్ మ్యాప్ ద్వారా గ్రామంలోని వనరులు, అవసరాలను గుర్తించే ప్రక్రియపై ఉపాధి హామీ పనులను టెక్నికల్ అధికారీ గోపాల్ వివరించారు. గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, అభివృద్ధి పనులను గుర్తించేందుకు రూపొందించిన 375 రకాల పనుల జాబితాపై అధికారులు అవగాహన కల్పించారు. గ్రామాభివృద్ధికి అవసరమైన పనులను ప్రజల భాగస్వామ్యంతో గుర్తించి, వాటిలో అత్యంత ప్రాధాన్యత కలిగిన పనులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. అక్టోబర్ 2న గ్రామసభ నిర్వహించి, ప్రజల సూచనలు,అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని గ్రామాభివృద్ధి ప్రణాళికలో పనులను చేరనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. గ్రామ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనుల ఎంపికలో ప్రజలు భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పానుగంటి నిర్మల వెంకటయ్య గౌడ్, పంచాయతీ కార్యదర్శి శ్రీను, టెక్నికల్ అసిస్టెంట్ గోపాల్, పాలకవర్గ సభ్యులు, మహిళా సంఘాల సభ్యులు, కోరే అలివేలు సైదా బేగం , నాంపల్లి రోజా ఆశా కార్యకర్తలు ఎ.సునీత, కోరే లలిత, ఎ కవిత ఏఎన్ఎం గాదెపాక పుష్పలత , రైతులు కామిశెట్టి యాదయ్య, శ్రీకాంత్, నాంపల్లి బాలయ్య, జింకల యాదగిరి, గుండెబోయిన యాదగిరి, కోరే యోహాన్ , గడ్డి కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

## పేద కుటుంబానికి రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక చేయూత



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (కడ్తాల్):** ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు అండగా నిలుస్తూ రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తోందని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు..కడ్తాల్ మండల కేంద్రంలో మద్రేపల్లి గ్రామపంచాయతీకి చెందిన వల్లపు దాసు ఈదమ్మ మృతి చెందడంతో, ఆమె దశదినకర్మ సందర్భంగా మృతురాలి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జర్పుల దశరథ్ నాయక్ పరామర్శించారు. అనంతరం ట్రస్ట్ తరఫున జైపాల్ యాదవ్ చేతుల మీదుగా కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు..ఈ సందర్భంగా జైపాల్ యాదవ్ మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు ట్రస్ట్ అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. సమాజంలోని పేదలను ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం హర్షణీయమని పేర్కొన్నారు. రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ నిరంతరం సేవా కార్యక్రమాలు చేపడుతూ ఎంతోమందికి భరోసాగా నిలుస్తోందన్నారు. ఆర్థిక సాయం అందుకున్న ఈదమ్మ కుటుంబ సభ్యులు జర్పుల దశరథ్ నాయక్, జైపాల్ యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్ వీరయ్య, మాజీ సర్పంచ్ భాగ్యమ్మ జంగయ్య, మాజీ ఉపసర్పంచ్ కడారి రామకృష్ణ, నరసింహ, ముత్యాలు, నాయకులు భాస్కర్ రెడ్డి, బిక్షపతి, మహేష్, నరేందర్, బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రైతుల పంటలకు గిట్టుబాటు ధర, రుణమాఫీ అమలు చేయాలి

**సిపి ఐ (ఎం)మండల కార్యదర్శి. నాంపల్లి చంద్రమౌళి**



**క్రైమ్ మిర్రర్, నాంపల్లి :** నవంబర్ 15 నుంచి 20 వరకు నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న అఖిల భారత రైతు సంఘం 36వ మహాసభల సందర్భంగా నల్లగొండలో లక్ష మందితో నిర్వహించే రైతు బహిరంగ సభను జయప్రదం చేయాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి నాంపల్లి చంద్రమౌళి రైతులకు పిలుపునిచ్చారు. మహాసభల ప్రచార కార్యక్రమంలో భాగంగా నాంపల్లి మండలం మేళ్ల వాయి గ్రామంలో రైతులను కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాంపల్లి చంద్రమౌళి మాట్లాడుతూ రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై దేశవ్యాప్తంగా చర్చించి, భవిష్యత్ పోరాటాలకు కార్యాచరణ రూపొందించేందుకు అఖిల భారత రైతు సంఘం 36వ మహాసభలు జరుగుతున్నాయని తెలిపారు. నాంపల్లి మండల రైతాంగానికి ప్రధానమైన లక్ష్మణాపురం ప్రాజెక్టును వెంటనే పూర్తి చేసి, ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రాజెక్టుల నిర్మాణంలో జాప్యం వల్ల రైతులు సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వాసిపాక ముత్తిలింగం మాట్లాడుతూ

రైతులపై భారాన్ని మోపే రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని, రైతులు పండించిన ప్రతి పంటకు స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం గిట్టుబాటు ధర కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మార్కెట్‌లో పంటలకు సరైన ధర లభించక రైతులు నష్టపోతున్నారని, ప్రభుత్వమే కొనుగోలు వ్యవస్థను బలోపేతం చేయాలని అన్నారు. ప్రస్తుతం అనేక ప్రాంతాల్లో కరువు పరిస్థితులు తీవ్రంగా ఉన్నందున, రాబోయే రోజుల్లో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా, పశువులకు నీరు, సాగునీటి వనరుల పరిరక్షణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని అన్నారు. వర్షాభావం, నీటి కొరత కారణంగా అనేక ప్రాంతాల్లో పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని, దిగుబడులు తగ్గడంతో రైతుల ఆదాయం పడిపోయిందని తెలిపారు. పంట నష్టాన్ని సమగ్రంగా అంచనా వేసి నష్టపరిహారం అందించడంతో పాటు రైతుల బ్యాంకు రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందించడం, పంటల బీమాను సమర్థవంతంగా అమలు చేయడం, సాగునీటి వనరులను అభివృద్ధి చేయడం, రైతుల ఉత్పత్తులకు మార్కెట్ సౌకర్యం కల్పించడం వంటి అంశాలపై ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. రైతాంగం ఎదుర్కొంటున్న సాగునీరు, తాగునీరు, గిట్టుబాటు ధర, పంట నష్టం, రుణభారం, విద్యుత్, విత్తనాలు, ఎరువులు, మార్కెట్ సమస్యలు తదితర అంశాలపై పోరాటాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమస్యలపై రైతాంగాన్ని ఐక్యం చేసేందుకు నిర్వహిస్తున్న అఖిల భారత రైతు సంఘం 36వ మహాసభల ప్రచార కార్యక్రమాలను గ్రామగ్రామాన విస్తృతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. నవంబర్ 15 నుంచి 20 వరకు నల్లగొండలో జరిగే మహాసభలను, లక్ష మందితో నిర్వహించే రైతు బహిరంగ సభను రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ అధ్యక్షుడు కొమ్ము లక్ష్మయ్య, సిఐటియు మండల కన్వీనర్ ఏదుళ్ళ సునీత మండల కమిటీ సభ్యులు కొమ్ము ముఖేష్ కుందేళ్ళ పర్వతాలు కామిశెట్టి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్,ఎంఎస్పీ మండల కమిటీల ఎన్నిక

**ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు నూతనకల్ మండల ఇంచార్జ్**

**కనుకుంట్ల వెంకన్న మాదిగ అధ్యక్షతన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీల మండల**



**నూతనకల్ (క్రైమ్ మిర్రర్):** కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులుగా నకరికంటి వీరబాబు మాదిగ,అధికార ప్రతినిధిగా బత్తుల సురేష్ మాదిగ,ఉపాధ్యక్షులుగా ఇరుగు నగేష్ మాదిగ,ప్రధాన కార్యదర్శి గా నాయకపు మల్లేష్ మాదిగ,కార్యదర్శులుగా పాల్వాయి దిలీప్ కుమార్,గంట రామకృష్ణ,నకెర కంటి మనోజ్ మాదిగ,సహాయ కార్యదర్శి గంట నరేష్ మాదిగ,

**మహాజన సోషలిస్టు పార్టీ మండల కమిటీ:** అధ్యక్షులు గా ఇరుగు వెంకన్న మాదిగ ఎన్నికయ్యారు.కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి జిల్లా ఇన్చార్జి బచ్చలకూరి వెంకటేశ్వర్లు మాదిగ మాట్లాడుతూ అక్టోబర్ 6న హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ లో జరిగే ఎమ్మెస్ ఎఫ్ మాదిగ విద్యార్థుల ప్రతినిధుల జాతీయ మహాసభను విజయవంతం చేయాలని కోరారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వం కోసం మందకృష్ణ మాదిగ ఉద్యమం చేస్తున్నారని తెలిపారు, ఎస్సీ వర్గీకరణ సాధించడం ద్వారా దళిత సమాజంలో ఎన్నో సంవత్సరాలుగా అంతర్గతంగా పేరుకుపోయిన అసమానతలు క్రమంగా తొలగిపోతున్నాయని అన్నారు. ఇప్పటివరకు అవకాశాలకు నోచుకోని మాల, మాదిగ తదితర ఎస్సీ ఉపకులాలకు వర్గీకరణ ద్వారా విద్య, ఉద్యోగ రంగాల్లో సముచిత అవకాశాలు లభించే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ దళిత సమాజంలో సమానత్వ సాధనకు దోహదపడుతుందని పేర్కొన్నారు. కుల వివక్ష, పేదరికం, అణచివేత కారణంగా సమాజంలో సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతలు తీవ్రంగా పెరిగాయని వారు అన్నారు. ఈ అసమానతలను, సామాజిక రుగ్మతలను తొలగించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ లక్ష్యంతోనే పద్మశ్రీ మందకృష్ణ మాదిగ గారు భవిష్యత్ ఉద్యమానికి శ్రీకారం చుడుతున్నారని అన్నారు. ఉద్యమాన్ని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎస్ఎఫ్ అనుబంధ సంఘాల నూతన కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం చిల్పకుంట్ల గ్రామ సర్పంచ్ అంజేపల్లి నర్సమ్మ లక్ష్మయ్య, ఎంఎస్పీ జిల్లా మాజీ అధ్యక్షులు, యాతాకుల రాజన్న మాదిగ,రాష్ట్ర నాయకులు ,యర్ర వీరస్వామి మాదిగ బాలెశీల కిరణ్ కుమార్ మాదిగ, పాల్వాయి బాలయ్య మాదిగ పాల్వాయి పరశురాములు మాదిగ, నూతనకల్ మాజీ అధ్యక్షుడు గంగాధరి లక్ష్మీకాంత్ మాదిగ, వివిధ గ్రామాల గ్రామ శాఖ అధ్యక్షులు యువకులు ఉద్యమకారులు పాల్గొన్నారు.


క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం

తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.
క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.
తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.
న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.
స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.
సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.
సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.
ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.
9393929595


# క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక ఆరోగ్యం

**అథ్లెటిక్స్ సెలక్షన్ పోటీల ప్రారంభంలో మేయర్ ధర్ని మధుకర్**




**మంచిర్యాల సెప్టెంబర్ 30 (క్రైమ్ మిర్రర్):** విద్యార్థులు, యువత నిత్యం ఏదో ఒక క్రీడలో పాల్గొనడం ద్వారా మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ఆరోగ్యాన్ని పొందుతారని మంచిర్యాల కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్ అన్నారు. క్రీడల్లో ప్రతిభ చాటి మంచిర్యాల జిల్లాకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలని పిలుపునిచ్చారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ కళాశాల మైదానంలో జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అథ్లెటిక్స్ సెలక్షన్ పోటీలను మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య మహేష్‌తో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఎదిగే వయసులో క్రీడల్లో పాల్గొనడం విద్యార్థుల శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసానికి దోహదపడుతుందన్నారు. ప్రతిరోజూ కొంత సమయాన్ని క్రీడలకు కేటాయిస్తే ఒత్తిడి తగ్గి ఉత్సాహంగా ఉండవచ్చని పేర్కొన్నారు. మండల, జోనల్, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలు క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు దోహదపడతాయని అన్నారు. క్రీడాకారులు కేవలం జాతీయ స్థాయికే పరిమితం కాకుండా అంతర్జాతీయ స్థాయిలోనూ రాణించాలని ఆకాంక్షించారు. పట్టుదల, క్రమశిక్షణతో నిరంతరం సాధన చేయాలని సూచించారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓటమి ఎదురైనప్పుడు నిరాశ చెందకుండా మరింత పట్టుదలతో సాధన కొనసాగించాలని సూచించారు. క్రీడాకారులు ఉన్నత స్థాయికి ఎదిగితే వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, శిక్షకులతో పాటు జిల్లాకు గర్వకారణమవుతుందని అన్నారు. క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి వారికి అవకాశాలు కల్పిస్తున్న జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వాహకులు, క్రీడా ఉపాధ్యాయులను మేయర్ అభినందించారు. విద్యార్థులు క్రీడలతో పాటు చదువులోనూ రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. యువతను క్రీడల వైపు ప్రోత్సహించేందుకు తనవంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు చిందం సత్యవతి శ్రీనివాస్, నమ్మయ్య, షేర్ శ్రీలక్ష్మి పవన్, క్రీడా ఉపాధ్యాయులు, నిర్వాహకులు, శిక్షకులు, విద్యార్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు.





# కొల్లూరులో ఐదు ఎకరాల్లో మోడల్ మార్కెట్

**భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఆధునిక మార్కెట్ నిర్మాణం**

**స్థల సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలి: ఎమ్మెల్యే జిఎంఆర్**

పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 30: తెల్లాపూర్ డివిజన్ కొల్లూరు పరిధిలో ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఐదు ఎకరాల విస్తీర్ణంలో మోడల్ మార్కెట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం కొల్లూరులోని సర్వే నంబర్ 203లో మోడల్ మార్కెట్ ఏర్పాటుకు ప్రతిపాదించిన స్థలాన్ని ఎమ్మెల్యే జిఎంఆర్ పరిశీలించారు. కొల్లూరు ప్రాంతంలో పెరుగుతున్న జనాభా, వాణిజ్య అవసరాలకు అనుగుణంగా మార్కెట్‌ను అన్ని ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు. మార్కెట్ ఏర్పాటుకు అవసరమైన భూ సర్వే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి, భూమి కేటాయింపునకు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ సరస్వతిని ఆదేశించారు. ప్రజలు, వ్యాపారులకు సౌకర్యవంతంగా ఉండేలా మౌలిక వసతులతో కూడిన సమగ్ర మార్కెట్‌గా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. కొల్లూరు వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను మరింత బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సోమిరెడ్డి, రాములు గౌడ్, మాజీ ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అనధికార నిర్మాణాలపై సీఎంసీ కొరడా...

**ఒక్కరోజే 15 కూల్చివేతలు...**



**క్రైమ్ మిర్రర్ సైబరాబాద్:** సీఎంసీ పరిధిలో అనధికార నిర్మాణాలపై అధికారులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. బుధవారం నాటి డ్రైవ్ లో 15 అనధికార నిర్మాణాలను గుర్తించి కూల్చివేసారు. 8 నోటీసులు జారీ చేసి, ఒక నిర్మాణాన్ని సీజ్ చేశారు. జోన్ల వారీగా.. సెర్లింగంపల్లి - 5, కూకట్ పల్లి - 5, కుత్బుల్లాపూర్ - 5 చొప్పున కూల్చివేతలు చేపట్టారు. ప్రతి కేసుపై నిరంతర పర్యవేక్షణ ఉంచాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు.

# పదవీ విరమణ పొందిన వారికి కాట సుధా శ్రీనివాస్ గౌడ్ ఆత్మీయ సన్మానం







పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 30: బీరంగూడ డివిజన్ పరిధిలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానంలో పదవీ విరమణ పొందిన కార్యనిర్వహణాధికారి మాచర్ల దేవానాధం, అర్చకులు సువర్ణ రాధాకృష్ణ అవధానిలకు ఆత్మీయ సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ హాజరై పదవీ విరమణ పొందుతున్న వారిని శాలువాలతో సన్మానించారు. దేవస్థానానికి వారు అందించిన సేవలను ఈ సందర్భంగా ఆమె అభినందించారు. అనంతరం కాట సుధా శ్రీనివాస్ గౌడ్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఆశీస్సులు పొందారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
6 గురువారం 1-10-2026

# కోడంగల్ నియోజకవర్గంలోని దోబీ పోస్టులు రజకులకే కేటాయించాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ కు వినతి

## తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి

**క్రైమ్ మిర్రర్ ,వికారాబాద్:-** కోడంగల్ పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న 300 నుంచి 320 పడకల ఆసుపత్రితో పాటు వివిధ విద్యాసంస్థల హాస్టళ్లు, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో దోబీ పోస్టులను అర్హులైన రజక అభ్యర్థులతో భర్తీ చేయాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ని కలిసి మెమోరండం అందజేసిన తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక. నూతనంగా నిర్మిస్తున్న ఆసుపత్రి, గురుకుల పాఠశాల హాస్టల్, ఫార్మసీ కళాశాల హాస్టల్, పాలిటెక్నిక్ కళాశాల హాస్టల్, బీటెక్ కళాశాల హాస్టల్‌తో పాటు శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో దోబీ పోస్టులను అర్హత కలిగిన రజక అభ్యర్థులతోనే భర్తీ చేయాలని కోరారు. అదేవిధంగా ఆయా సంస్థల్లో బట్టలు ఉతికే కాంట్రాక్టులను కూడా రజకులకే కేటాయించాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ గారికి విజ్ఞప్తి చేశారు. రజకుల జీవనోపాధికి సంబంధించిన ఈ అంశంలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి జిల్లా గౌరవ అధ్యక్షులు సిహెచ్ మొగులయ్య,జిల్లా ప్రధాన కార్యదర్శి మోత్కూరు వెంకటేష్, జిల్లా మహిళా అధ్యక్షురాలు లక్ష్మీ, ఉపాధ్యక్షురాలు లలిత,జిల్లా



ఉపాధ్యక్షులు గడ్డమీది వెంకటప్ప,ప్రభాకర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్,జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి అనీల్, జిల్లా యూత్ కార్యదర్శి నాగేష్ గౌటిగ,యం ఎస్ ఎస్ సంఘం నాయకులు ఎర్ర ఆంజనేయులు,పరిగి మండలం అధ్యక్షులు జగన్,పరిగి నియోజకవర్గ అధ్యక్షులు యాదయ్య,గోపాల్ వార్డు మెంబర్ , రాపోలు వార్డు మెంబర్ రాజు, దౌల్తాబాద్ శ్యామప్ప,జుంటుపల్లి వార్డు మెంబర్ చిరుమల్ ఎల్లప్ప, ఇస్త్రీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు



## ఎస్ఎఫ్ఐ అఖండ విజయం జన్ జీ పోరాట స్ఫూర్తికి నిదర్శనం

**క్రైమ్ మిర్రర్, నాంపల్లి:** నాంపల్లి మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎస్ఎఫ్ఐ అఖండ విజయం సాధించడం పట్ల నాంపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎస్ఎఫ్ఐ కమిటి ఆధ్వర్యంలో హర్షం వ్యక్తం చేస్తూ బారి ఎత్తున టపాకాయలు కాల్చారు. ఈ విజయం జన్ జీ పోరాట స్ఫూర్తికి నిదర్శనం. విశాల భారత దేశమంతటా ఎస్ ఎఫ్ ఐ దే విజయం సాధించడం పై సంతోషం వ్యక్తపరిచారు. ఈకార్యక్రమంలో రెహమాన్, వర్షిత్, ఎనొష్ , మణికంఠ, గణేష్, అభిలాష్, నంద కిశోర్, ప్రకాష్, రాంచరణ్, శివరామకృష్ణ, శివ, నరేందర్, శివచారి తదితరులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఎన్నికలకు సిద్ధం కావాలి

### అభ్యర్థి ఎవరైనా కేసీఆర్ నాయకత్వాన్ని బలపరచాలి

### ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు కార్యకర్తలు



సమాయత్తం కావాలని మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో అత్యధిక సంఖ్యలో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన వారందరి ఓట్లను పెద్ద ఎత్తున నమోదు చేయించాలని కార్యకర్తలకు సూచించారు. మహేశ్వరం నియోజకవర్గం జిల్లెలగూడ సామ యాదిరెడ్డి గార్డెన్స్‌లో మహబూబ్‌నగర్ --హైదరాబాద్--రంగారెడ్డి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా నిర్వహించిన మహేశ్వరం నియోజకవర్గ కార్యకర్తల సన్నాహక సమావేశంలో సబితా ఇంద్రారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గంలోని గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన ప్రతి ఒక్కరిని గుర్తించి, అర్హత ఉన్న వారందరి ఓట్లను పెద్ద ఎత్తున నమోదు చేయించేలా కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో కార్యకర్తలందరి సహాయ సహకారాలు, కృషితో సురభి వాణీదేవిని గెలిపించుకోవడం జరిగిందని గుర్తుచేశారు. అదే పోరాట స్ఫూర్తితో రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని ఆమె సూచించారు. అభ్యర్థి ఎవరైనా కేసీఆర్ నాయకత్వాన్ని బలపరుస్తూ ముందుకు సాగాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ప్రతి కార్యకర్త బాధ్యతగా పనిచేసి పట్టభద్రుల ఓట్ల నమోదు ప్రక్రియను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు, మహేశ్వరం నియోజకవర్గ అనుబంధ సంఘాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎస్ఎఫ్ఐ విజయకేతనం

### 451 ఓట్ల మెజారిటీతో కామ్రేడ్ దిల్షాదా రైహాన్ ఘన విజయం



**క్రైమ్ మిర్రర్, యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో:-** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి సంఘం ఎన్నికల్లో ఎస్ఎఫ్ఐ భాగస్వామ్యంతో కూడిన కూటమి ఘన విజయం సాధించిన సందర్భంగా ఎస్ఎఫ్ఐ చౌటుప్పల్ మండల కమిటీ ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలు నిర్వహించినట్లు ఎస్ఎఫ్ఐ చౌటుప్పల్ మండల కార్యదర్శి తిగుళ్ళ శ్రీనివాస్ తెలిపారు.ఈ సందర్భంగా తిగుళ్ళ శ్రీనివాస్ మాట్లాడుతూ, "హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఎన్నికల్లో కామ్రేడ్ దిల్షాదా రైహాన్ 2,178 ఓట్లు సాధించి 451 ఓట్ల మెజారిటీతో విద్యార్థి సంఘం అధ్యక్షురాలిగా ఘన విజయం సాధించడం సంతోషకరం. ఈ విజయం కేవలం ఒక ఎన్నికల విజయం మాత్రమే కాదు.. విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాడే విద్యార్థి ఉద్యమానికి విద్యార్థులు ఇచ్చిన గుర్తింపు" అని అన్నారు."విద్యార్థుల హక్కులు, విద్య, స్కాలర్‌షిప్‌లు, క్యాంపస్‌లో ప్రజాస్వామ్య హక్కులు, సామాజిక న్యాయం వంటి అంశాలపై ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాడుతోంది. విద్యార్థుల సమస్యలను ముందుకు తీసుకెళ్లే ఉద్యమాన్ని హెచ్సీయు విద్యార్థులు ఆదరించి ఈ విజయాన్ని అందించారు. విద్యార్థుల్లో విభజనకు దారితీసే మతోన్మాద రాజకీయాలకు వ్యతిరేకంగా విద్యార్థి ఐక్యత, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం కోసం పోరాటాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది" అని ఆయన పేర్కొన్నారు." హెచ్సీయు విద్యార్థులు ఎస్ఎఫ్ఐ ఎర్రజెండాకు అందించిన ఈ విజయంతో దేశవ్యాప్తంగా విద్యార్థి ఉద్యమానికి మరింత స్ఫూర్తి లభించింది. విద్యార్థుల గొంతుకగా, విద్యార్థుల హక్కుల కోసం నిరంతరం పోరాడే ఎస్ఎఫ్ఐ మరింత బలంగా ముందుకు సాగుతుంది" అని అన్నారు.కామ్రేడ్ దిల్షాదా రైహాన్ విజయంతో పాటు హెచ్సీయు విద్యార్థులకు, ఎన్నికల్లో విజయం సాధించిన విద్యార్థి నాయకత్వానికి ఎస్ఎఫ్ఐ చౌటుప్పల్ మండల కమిటీ తరఫున విప్లవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు అరవిందు వరుణ్ శ్రీ సాయి వంశీ నితిన్ తదితరులు పాల్గొన్నారు

## ఐక్యత చాటిన మున్నూరు కాపు సంఘం సభ్యులు

**మున్నూరు కాపు సంఘం స్థలం వద్ద ఉద్రిక్తత**

**సమాచారం అందగానే కదిలిన మున్నూరు కాపు సంఘం**

**సంఘ సభ్యుల ఐక్యతే బలమని పేర్కొన్న నాయకులు**

**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** మున్నూరు కాపు సంఘానికి సంబంధించిన స్థలం వద్ద డబ్బాల తొలగింపు విషయంలో కొంతమంది వెనక్కి వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారనే సమాచారం తెలుసుకున్న సంఘ సభ్యులు వెంటనే స్పందించి అక్కడికి చేరుకున్నారు. పరిస్థితిని గమనించిన సభ్యులు సంఘీభావంగా నిలబడి, సంఘ స్థలానికి సంబంధించిన హద్దులను కాపాడేందుకు ముందుకు వచ్చారు. సమాచారం అందిన వెంటనే సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకోవడంతో సంఘం ఐక్యత మరోసారి స్పష్టమైంది. సంఘానికి సంబంధించిన స్థలం, హద్దుల పరిరక్షణ విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సభ్యులు పేర్కొన్నారు. సంఘ గ్రూపులో సమాచారం అందిన వెంటనే స్పందించి, ఎలాంటి ఆలస్యం లేకుండా సంఘీభావంగా అక్కడికి చేరుకున్న ప్రతి సభ్యుడికి మున్నూరు కాపు సంఘం తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.




భవిష్యత్తులో కూడా మున్నూరు కాపు కులస్తులకు ఏ సమస్య ఎదురైనా సభ్యులంతా ఐక్యంగా నిలబడి, శాంతియుతంగా మరియు చట్టబద్ధమైన మార్గాల్లో సమస్య పరిష్కారానికి కృషి చేయాలని సంఘ సభ్యులు పిలుపునిచ్చారు. సంఘం ఐక్యతే తమ బలమని పేర్కొన్నారు.

# అక్టోబర్ 2న జరిగే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం

### జర్నలిస్టుల హక్కుల కోసం కలిసి పోరాడుదాం

### పెబ్బేరు ప్రెస్? క్లబ్? అధ్యక్షుడు గొడుగు బాలవర్ధన్?

**వనపర్తి సెప్టెంబర్ 30 క్రైమ్ మిర్రర్ :** జర్నలిస్టుల హక్కుల కోసం కలిసి పోరాటం చేద్దామని పెబ్బేరు ప్రెస్? క్లబ్? అధ్యక్షుడు గొడుగు బాలవర్ధన్? అన్నారు. అక్టోబరు 2 న ఇండియన్? జర్నలిస్టు యూనియన్? గాంధీ జయంతి సందర్భంగా గాంధీజీ విగ్రహాల వద్ద నిరసన కార్యక్రమాలను చేయాలని పిలుపునిచ్చింది. ఈ మేరకు ఐజేయు అనుబంధంగా ఉన్న టీయూడబ్ల్యూజే రాష్ట్ర శాఖ పిలుపు మేరకు జిల్లాకేంద్రాల్లో జిల్లా శాఖల సమక్షంలో అధ్యక్ష, కార్యదర్శులు నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బుధవారం పెబ్బేరు ప్రెస్? క్లబ్?లో నిర్వహించిన అత్యవసర సమావేశంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి తదితర ముఖ్య నాయకులు మాట్లాడారు. శుక్రవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని గాంధీ చౌక్? వద్ద నిర్వహించున్న నిరసన కార్యక్రమానికి పెబ్బేరు ప్రెస్? క్లబ్? తరఫున జర్నలిస్టులు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. ఎన్నో ఏళ్లుగా పెండిగులో ఉన్న ఇళ్ల స్తలాల సమస్య, నెల




వారీ పారితోషకాల గురించి, జర్నలిస్టులపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో యూనియన్? చేపట్టిన జర్నలిస్టుల డిమాండ్ల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రధానకార్యదర్శి సూర్యవంశం పరుశరాముడు యూనియన్? నియోజకవర్గ జనరల్? సెక్రటరీ బాలరాజు, క్లబ్? ఉపాధ్యక్షులు గోపాలకృష్ణ, కిరణ్? కుమార్? గౌడ్?, నాయకులు రాజేంద్రప్రసాద్?, అతీఖ్? పాషా, మన్నెం, రాంబాబు, నాగరాములు, తరుణ్?, లక్ష్మీనారాయణ, రమేష్?, కుమార్?, భాస్కర్?, ఎల్లస్వామి, చెంద్రాయుడు, కృష్ణ, రామకృష్ణ, బుచ్చన్న, ఎం. గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## అత్తాపూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

### హిందూ దేవుళ్లపై వ్యాఖ్యలకు నిరసనగా బీజేపీ నాయకుల ఆందోళన

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హిందూ దేవుళ్లపై చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ అత్తాపూర్ డివిజన్‌లో బీజేపీ నాయకులు ఆందోళన చేపట్టారు. అత్తాపూర్ డివిజన్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం



చేసి నిరసన వ్యక్తం చేశారు. అత్తాపూర్ డివిజన్ అధ్యక్షుడు సుల్గే వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి శ్రీరాముడు, పరమశివుడి గురించి చేసిన వ్యాఖ్యలు హిందూ సమాజం మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయని వారు ఆరోపించారు. హిందూ దేవుళ్లను రాజకీయ వ్యాఖ్యల్లోకి తీసుకురావడం సరికాదని పేర్కొంటూ ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి శ్రీరాముడు, శివుడికి సంబంధించి చేసిన వ్యాఖ్యలపై బీజేపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. ఈ వ్యాఖ్యలపై రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ శ్రేణులు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. అత్తాపూర్‌లో జరిగిన నిరసన కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ విజయకుమార్, డివిజన్ ప్రధాన కార్యదర్శులు వెంకటరెడ్డి, జయానంద్‌రెడ్డి, శశికాంత్ శర్మ, మణికంఠ, జితేందర్ సింగ్, గుర్విన్ సింగ్, నరేష్, రాము, లకన్, బాలకృష్ణ, భరత్, వెంకటేష్, అంకుష్, సతీష్, నితిన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని హిందూ సమాజానికి వివరణ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.



# మృతుడు ఎల్ఐసి ఏజెంట్ కుటుంబానికి 40 వేల సాయం

### వనపర్తి ఎల్ఐసి బ్రాంచ్ లియాఫి సంఘం

**వనపర్తి సెప్టెంబర్ 30 క్రైమ్ మిర్రర్ :** వనపర్తి ఎల్ఐసి బ్రాంచ్ లో సీనియర్ ఏజెంటుగా పనిచేస్తున్న కాశన్న గౌడ్ బుధవారం సోమవారం మృతి చెందారు.విషయం తెలుసుకున్న వనపర్తి ఎల్ఐసి బ్రాంచ్ లియాఫీ సంఘం నాయకులు ఘనపూర్ మండలం సూరాయపల్లి గ్రామంలో వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.వనపర్తి బ్రాంచ్ లియాఫీ యూనియన్ తరపున 10 వేల రూపాయలు మరియు హైదరాబాద్ డివిజన్ లియాఫీ తరపున ఏజెంట్ మిత్రుల సహకారంతో 30వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. వనపర్తి బ్రాంచ్ ఎల్ఐసి ఏజెంట్లకు ఎలాంటి ఆపద వచ్చిన ఎల్లవేళలా లియాఫి యూనియన్ అండగా ఉంటుందని లియాఫి సంఘం అధ్యక్షుడు కృష్ణ, లియాఫి సంఘం కార్యదర్శి రాజశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి ఆర్ జే. ప్రభాకర్,జోనల్ లీడర్ ఇందిరా మన్యం,ఉపాధ్యక్షులు నరోత్తం రెడ్డి,మరియు ఏజెంట్ మిత్రులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం




**క్రైమ్ మిర్రర్,సంస్థాన్ నారాయణపురం:-** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోని వివిధ పాఠశాలల్లో విశిష్ట సేవలు అందిస్తున్న 22 మంది మండల ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానోత్సవ కార్యక్రమం బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల విద్యాధికారి గోలి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఆర్ఓ పి. శ్రీనివాసరెడ్డి,ఎంపీడీఓ కె. ప్రమోద్ కుమార్,పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ సీతా పాండు, గ్రామ సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి, హాజరై మండలంలోని ఉత్తమ ఉపాధ్యాయులతో పాటు జిల్లా స్థాయి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యాయులు, జిల్లా ఉపాధ్యాయులు,.వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## బాలాపూర్ గణేష్ ఉత్సవాల విజయవంతానికి సహకరించిన అధికారులకు సన్మానం



బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) బాలాపూర్ గణేష్ నవరాత్రి ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించడంలో ప్రతి అంశంలోనూ సహాయ సహకారాలు అందించిన అధికారులకు బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి తరఫున ఘనంగా సన్మానం నిర్వహించారు. టీజీఎస్పీడీసీఎల్ సిఎండి జితేష్ పాటిల్, శంషాబాద్ జోన్ కమిషనర్ చంద్రకళ, సిఈ ఆర్ఆర్ జోన్ ఎల్. గోపయ్య, ఎస్ ఈ రాజేంద్రనగర్ సర్కిల్ రవి ప్రసాద్, డిఈ కందుకూరు గోపాల కృష్ణ, ఏడిఈ మామిడిపల్లి ఎస్డి శంకర్ లను ఈ సన్మాన కార్యక్రమంలో బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి చైర్మన్ కల్లెం నిరంజన్ రెడ్డితో పాటు కమిటీ సభ్యులు సామ్‌రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, వంగేటి సుధాకర్ రెడ్డి, టేకుల సుధాకర్ రెడ్డి, టేకుల శశిధర్ రెడ్డి, బొక్క కొండల్ రెడ్డి, గుండోజి సాయికిరణ్ చారి పాల్గొని ఉత్సవ బాలాపూర్ గణేష్ ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లలో అధికారులు అందించిన సహకారం ఎంతో విలువైనదని బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి పేర్కొంది. ఉత్సవాల విజయవంతానికి సహకరించిన అధికారులందరికీ సమితి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

# హుజూర్ నగర్ పోలీస్ స్టేషన్ డీఎస్పీ ఆకస్మిక తనిఖీ

### పలు రికార్డుల పరిశీలన
### శాంతి భద్రతలకు ప్రజలు పోలీసులకు సహకరించాలి
### నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి
### కోదాడ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి






**క్రైమ్ మిర్రర్,హుజూర్ నగర్ :** హుజూర్నగర్ పోలీస్ డివిజన్ పరిధిలో డ్రగ్స్, గంజాయి, సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు డీఎస్పీ శ్రీనివాసరెడ్డి తెలిపారు. వార్షిక తనిఖీల్లో భాగంగా నేరాల నియంత్రణ, కేసుల దర్యాప్తు, పోలీసుల పనితీరుపై సమగ్రంగా సమీక్ష నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. యువతలో గంజాయి, డ్రగ్స్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో వాటి కట్టడికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని డీఎస్పీ తెలిపారు. గంజాయి అక్రమ రవాణా, వినియోగంపై నిఘా పెంచడంతో పాటు ఎన్డీపీఎస్ కేసుల్లో చట్టపరమైన చర్యలను సమర్థవంతంగా అమలు చేయడంపై దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. హుజూర్నగర్ పరిధిలోని 11 గ్రామాలకు ఒక్కో పోలీస్ అధికారి/కానిస్టేబుల్ను విలేజ్ పోలీసింగ్ అధికారిగా నియమించినట్లు డీఎస్పీ తెలిపారు. ఆయా గ్రామాల్లో నేరాల పరిస్థితి, సమస్యలు, ప్రజల పరిస్థితులపై సంబంధిత పోలీసు సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. వార్షిక తనిఖీల్లో భాగంగా విలేజ్ పోలీసింగ్ అధికారులను కూడా వారి పరిధిలోని గ్రామాల పరిస్థితులపై ప్రశ్నించి, వారికి ఉన్న అవగాహనను పరిశీలిస్తున్నట్లు డీఎస్పీ వెల్లడించారు.

**నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి**

గతంతో పోల్చితే హుజూర్నగర్లో ప్రాపర్టీ నేరాలు తగ్గుముఖం పట్టాయని డీఎస్పీ తెలిపారు. రోడ్డు ప్రమాదాల సంఖ్యలోనూ తగ్గుదల నమోదైందన్నారు. అయితే ఇటీవల కాలంలో సైబర్ క్రైమ్ కేసులు, గంజాయి/ఎన్డీపీఎస్ కేసులు కొంత పెరుగుతున్నట్లు గుర్తించామని తెలిపారు. ఈ నేరాలపై ప్రత్యేక దృష్టి సారించి, నేరాల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ స్పష్టం చేశారు. గత ఐదేళ్ల నేర గణాంకాలతో పోల్చుతూ ప్రస్తుత పరిస్థితిని సమీక్షిస్తున్నామని, హుజూర్నగర్ డివిజన్లో నేరాల నియంత్రణకు అవసరమైన చర్యలను మరింత పటిష్టం చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం స్టేషన్ ఆవరణంలో ఎస్ఐలతో కలిసి మొక్కను నాటారు. నాటిన మొక్కను సంరక్షించాలని సిబ్బందికి సూచించారు. ఈ తనిఖీలలో సిఐ చరమందరాజు, ఎస్ఐలు నరేష్, హనుమాన్ నాయక్, సిబ్బంది, పాల్గొన్నారు.

# ఏరో విల్లాస్పై హైకోర్టు స్టేటస్కో

### 46 విల్లాల నిర్మాణ అనుమతి రద్దు.. యథాతథ స్థితి కొనసాగించాలని ఆదేశం
### జీవో 111 నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలంటూ పిటిషనర్ ఆరోపణలు





**గండిపేట(క్రైమ్ మిర్రర్):** శంషాబాద్ పరిధిలోని ఏరో విల్లాస్ ప్రాజెక్టుకు సంబంధించి 46 విల్లాలపై తెలంగాణ హైకోర్టు స్టేటస్కో ఆదేశాలు జారీ చేసింది. నిర్మాణ అనుమతులు రద్దయినప్పటికీ పనులు కొనసాగుతున్నాయని ఆరోపిస్తూ అనికేత్ భాటి దాఖలు చేసిన రిట్ పిటిషన్పై విచారణ చేపట్టిన కోర్టు.. జనవరి 7, 2022న ఇచ్చిన ఆదేశాల పరిధిలో ఉన్న 46 విల్లాల విషయంలో అప్పటి పరిస్థితినే కొనసాగించాలని స్పష్టం చేసింది. శంషాబాద్ గ్రామం, మండల పరిధిలోని సర్వే నంబర్లు 48, 49, 60, 61, 63, 84, 85, 86, 87, 88, 89లో నిర్మాణాలకు అనుమతులు రద్దయినప్పటికీ పనులు కొనసాగుతున్నాయని పిటిషనర్ ఆరోపించారు. క్యాచ్మెంట్ ఏరియాలో జీవో నంబర్ 111 నిబంధనలకు విరుద్ధంగా భారీ నిర్మాణాలు చేపడుతున్నారని తన పిటిషన్లో పేర్కొన్నారు. పిటిషనర్ చేసిన ఫిర్యాదు ఆధారంగా 2026 జూలై 18న షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ తరఫు న్యాయవాది హైకోర్టుకు తెలిపారు. ఈ వ్యవహారంపై ప్రస్తుతం విచారణ కొనసాగుతోందని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. అయితే ఏరో విల్లాస్ ప్రాజెక్టు డెవలపర్ తరఫు న్యాయవాది వాదిస్తూ.. 46 విల్లాల్లో ప్రస్తుతం ఎలాంటి నిర్మాణ కార్యకలాపాలు కొనసాగడం లేదని తెలిపారు. ఆయా విల్లాలు గతంలోనే నిర్మించబడ్డాయని, 2022 జనవరి 7న హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఆదేశాల నేపథ్యంలో వాటిని కూల్చివేయకుండా అధికారులు నిలిపివేశారని వివరించారు. పిటిషనర్ తరఫు న్యాయవాది ప్రమోద్ సింగ్ వాదిస్తూ.. గతంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను ఆధారంగా చేసుకుని, నిర్మాణ అనుమతులు రద్దయిన తర్వాత కూడా అక్రమ నిర్మాణాలను కొనసాగిస్తున్నారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ అంశంపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వాదించారు. ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు.. 46 విల్లాలకు సంబంధించిన భవన నిర్మాణ అనుమతులు రద్దయిన విషయాన్ని నమోదు చేసుకుంది. అదే సమయంలో 2022 జనవరి 7న ఇచ్చిన ఆదేశాల పరిధిలో ఉన్న 46 విల్లాల విషయంలో, ఆ ఆదేశాలు వెలువడిన తేదీ నాటికి ఉన్న పరిస్థితినే కొనసాగించాలని స్పష్టం చేసింది. ఏరో విల్లాస్ నిర్మాణాలకు సంబంధించి ఇదే అంశంపై దాఖలైన ఇతర పెండింగ్ రిట్ పిటిషన్లను కూడా ప్రస్తుత కేసుతో కలిపి విచారించే అంశంపై హైకోర్టు దృష్టి సారించింది. ఇందుకు సంబంధించి ప్రధాన న్యాయమూర్తి నుంచి అవసరమైన ఉత్తర్వులు పొందిన అనంతరం కేసును తిరిగి జాబితాలో చేర్చాలని ఆదేశించింది. దీంతో ఏరో విల్లాస్లోని 46 విల్లాలకు సంబంధించి ప్రస్తుతం ఉన్న నిర్మాణ స్థితిపై హైకోర్టు ఆదేశాలు కీలకంగా మారాయి. నిర్మాణ అనుమతులు, జీవో 111 నిబంధనలు, గతంలో ఇచ్చిన న్యాయస్థాన ఆదేశాల అమలు తదితర అంశాలపై తదుపరి విచారణలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాటర్ ట్యాంకర్పై కేసు

### నో ఎంట్రీలో రాంగ్రూట్లో ప్రయాణం..
### మై హోమ్ అవతార్ జంక్షన్లో ట్రాఫిక్ జామ్




**గండిపేట(క్రైమ్ మిర్రర్):** ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తూ రాంగ్రూట్లో ప్రయాణించిన వాటర్ ట్యాంకర్పై నార్సింగి పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం నిర్వహించిన స్పెషల్ డ్రైవ్లో భాగంగా మై హోమ్ అవతార్ జంక్షన్ వద్ద ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన వాటర్ ట్యాంకర్ను గుర్తించారు. ఉదయం సుమారు 10 గంటల సమయంలో టిఎస్05యుఎ4909 నంబర్ గల వాటర్ ట్యాంకర్ డ్రైవర్ ట్రాఫిక్ రద్దీ సమయాన్ని సైతం పట్టించుకోకుండా నో ఎంట్రీ సమయంలో క్రిన్స్ విల్లాస్ నుంచి మై హోమ్ అవతార్ వైపు సర్వీస్ రోడ్డులో రాంగ్రూట్లో వాహనాన్ని నడిపినట్లు పోలీసులు తెలిపారు. రాంగ్రూట్లో వాహనం రావడంతో ఇతర వాహనదారులకు ఇబ్బందులు ఏర్పడటంతో పాటు, ప్రమాదాలకు దారితీసే పరిస్థితి నెలకొంది. దీంతో అక్కడ ట్రాఫిక్ జామ్ ఏర్పడినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఇతరుల ప్రాణాలకు ప్రమాదం కలిగించే విధంగా నిర్లక్ష్యంగా వాహనం నడిపినందుకు సంబంధిత వాహనంపై చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై నార్సింగి ఇన్స్పెక్టర్, సెక్టార్ ఎస్ఐ ఆధ్వర్యంలో వాహనాన్ని గుర్తించి, సంబంధిత డ్రైవర్పై నార్సింగి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేయించారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని నో ఎంట్రీ ప్రాంతాల్లోకి ప్రవేశించడం, రాంగ్రూట్లో వాహనాలు నడపడం వంటి ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలను తీవ్రంగా పరిగణిస్తామని పోలీసులు తెలిపారు. రాంగ్రూట్లో ప్రయాణించే వాహనదారులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, అవసరమైన సందర్భాల్లో క్రిమినల్ కేసులు నమోదు చేసి కోర్టు ముందు హాజరుపరుస్తామని హెచ్చరించారు. ట్రాఫిక్ రద్దీ ప్రాంతాల్లో వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, నో ఎంట్రీ, వన్వే నిబంధనలను ఉల్లంఘించి ఇతరుల ప్రాణాలకు ముప్పు కలిగించేలా వాహనాలు నడపవద్దని నార్సింగి పోలీసులు సూచించారు.

## జీహెచ్ఎంసీలోనే కొనసాగించాలని వాటర్మెన్ల విజ్ఞప్తి



గండిపేట్,(క్రైమ్ మిర్రర్): గ్రామ పంచాయతీ కాలం నుండి జీహెచ్ఎంసీ వరకు దాదాపు 25 ఏళ్లుగా ప్రజలకు తాగునీటి సేవలందిస్తున్న వాటర్మెన్లు తమ భవిష్యత్పై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న తమకు ఉద్యోగ భద్రత, తగిన వేతనాలు కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలో పనిచేస్తున్న తమను హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బీకి బదిలీ చేసే ప్రతిపాదన వల్ల జీవనోపాధి దెబ్బతింటుందని భయాందోళన చెందుతున్నారు. జీహెచ్ఎంసీలోనే తమను కొనసాగిస్తూ ఇతర కార్మికులతో సమానంగా వేతనాలు అందజేయాలని కోరారు. ఇన్నేళ్ల తమ సేవలను పరిగణనలోకి తీసుకుని మానవతా దృక్పథంతో నిర్ణయం తీసుకోవాలని కోరుతూ జోనల్ కమిషనర్ చంద్రకళకు వినతిపత్రం సమర్పించారు.

# విద్యుత్ కోతలపై బిజెపి నిరసన

### విద్యుత్ సరఫరాలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం
### అంతరాయం లేని విద్యుత్ సరఫరా చేయాలి
### విద్యుత్ కార్యాలయం ముందు నిరసన తెలిపిన బిజెపి నాయకులు



**క్రైమ్ మిర్రర్,నేరేడుచర్ల :** తెలంగాణలో అప్రకటిత విద్యుత్ కోతలు, వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన కరెంట్ ఇవ్వడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందంటూ నేరేడుచర్ల మండలం కార్యాలయం వద్ద బీజేపీ నాయకులు భారీ ధర్నా నిర్వహించారు. రైతులకు సరైన విద్యుత్ సరఫరా చేయాలని, ముఖ్యంగా పంటలు కీలక దశలో ఉన్న సమయంలో త్రీఫేజ్ విద్యుత్ అంతరాయాలు లేకుండా అందించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ అధ్యక్షులు కొనతం నాగిరెడ్డి, చింతకుంట్ల రాజేష్ రెడ్డి ఆధ్వర్యంలో నేరేడుచర్ల విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ, విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయాలు ఏర్పడటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయానికి అవసరమైన సమయంలో నిరంతరాయంగా త్రీఫేజ్ విద్యుత్ అందించాలని అధికారులను డిమాండ్ చేశారు. ధర్నా కార్యక్రమానికి స్పందించిన విద్యుత్ శాఖ ఏఈ కార్యాలయం వద్దకు వచ్చి నాయకులతో మాట్లాడి, విద్యుత్ సరఫరాకు సంబంధించిన సమస్యలపై వివరణ ఇచ్చారు. రైతులకు ఎదురవుతున్న ఇబ్బందులను పరిశీలించి, సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారుఈ కార్యక్రమంలోజిల్లా నాయకులు తాళ్ల నరేందర్ రెడ్డి,సంకలమద్ది సత్యనారాయణ రెడ్డి, ఆకుల జాతయ్య గౌడ్,ఏమిరెడ్డ్ శంకర్ రెడ్డి,కొప్పు లక్ష్మినారాయణ గౌడ్,జూలూరి అశోక్,నందిపాటి హిందూజా,ఉరిమల్ల రామూర్తి,సీనియర్ నాయకులు బాల వెంకటేశ్వర్లు,బైరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మండల,పట్టణ నాయకులు,పాలకవీడు మండల అధ్యక్షులు నరి నాయక్,కిసానమోర్చా అధ్యక్షులు తాటికొండ పరమేష్ రెడ్డి కాలం నాగయ్య , నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అక్టోబర్ 2న మాంసం దుకాణాలు బందు పాటించాలి : జిహెచ్ఎంసి ఆదేశాలు

బాలాపూర్ (క్రైమ్ మిర్రర్): బంగారం మహాత్మా గాంధీ జయంతి (అక్టోబర్ 2) సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అక్టోబర్ 2న అన్ని రకాల జంతు వధశాలలు (స్లాటర్హౌస్లు), మాంసం, బీఫ్ విక్రయ దుకాణాలను విధిగా బందు పాటించాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. జిహెచ్ఎంసి పరిధిలో పశువధశాలలు, మాంసం దుకాణాలు తెరిచి ఉంచకుండా జిహెచ్ఎంసి ఉత్తర్వులను తప్పక పాటించాలని, అధికారుల ఆదేశాల మేరకు మున్సిపల్ సిబ్బంది మరియు పోలీస్ సిబ్బందితో ఈ నిబంధనల అమలుకై క్షేత్రస్థాయిలో కఠినంగా పర్యవేక్షించడం జరుగుతుందని శంషాబాద్ జోన్ వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ రవిచంద్ర తెలిపారు.

## నాంపల్లిలో ద్విచక్ర వాహనాల బహిరంగ వేలం




**క్రైమ్ మిర్రర్, నాంపల్లి:** నాంపల్లి మండలం పరిధిలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని వివిధ కేసులలో సీజ్ చేసిన ద్విచక్ర వాహనాలకు అక్టోబర్ 1న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ ఇన్ స్పెక్టర్ ఎండి అజాం ఫరీఫ్ తెలిపారు. డి టి ఎఫ్ నల్గొండ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో వేలం ప్రక్రియ జరుగుతుంది అని ఆసక్తి ఉన్నవారు అక్టోబర్ 1న ఉదయం 10 గంటలకు నాంపల్లి ఎక్సైజ్ స్టేషన్ కు చేరుకొని తమ పేర్లు నమోదు చేసుకోని వేలం పాటలో పాల్గొనాలని అధికారులు సూచించారు.

## మైలార్దేవ్పల్లి అంగన్వాడీ కేంద్రంలో పోషకాల వారోత్సవాలు

### ఆరోగ్యవంతమైన తరానికి పోషకాహారమే పునాది.. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అవగాహన




**గండిపేట(క్రైమ్ మిర్రర్):** ఆరోగ్యమే మహాభాగ్యమని, ఆరోగ్యవంతమైన సమాజమే బలమైన భవిష్యత్తుకు పునాది అని అంగన్వాడీ సిబ్బంది పేర్కొన్నారు. శేర్లింగంపల్లి ప్రాజెక్టు పరిధిలోని మైలార్దేవ్పల్లి సెక్టార్ దాసర బస్తీ అంగన్వాడీ కేంద్రంలో బుధవారం ఉదయం పోషకాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించి, పోషకాహారం ప్రాధాన్యతపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, తల్లిదండ్రులకు సమతుల్య ఆహారం, పోషకాహారం ప్రాముఖ్యతను వివరించడం. చిన్న వయస్సు నుంచే పిల్లలకు అవసరమైన పోషకాలు అందించడం ద్వారా వారి శారీరక, మానసిక ఎదుగుదల మెరుగుపడుతుందని అంగన్వాడీ సిబ్బంది తెలిపారు. కార్యక్రమానికి సూపర్వైజర్లు పద్మజ, కోమల్ ముఖ్య అతిథులుగా హాజరై పోషకాహారం ప్రాముఖ్యతను వివరించారు. పిల్లల ఎదుగుదలకు కేవలం కడుపు నిండే ఆహారం సరిపోదని, శరీరానికి అవసరమైన అన్ని పోషకాలు లభించేలా సమతుల్యమైన ఆహారం అందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఇంట్లో సులభంగా లభించే పప్పులు, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పాలు, గుడ్లు, చిరుధాన్యాలు వంటి పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను పిల్లల వయస్సుకు అనుగుణంగా అందించాలని సూచించారు. పిల్లలకు క్రమం తప్పకుండా ఆహారం ఇవ్వడంతో పాటు పరిశుభ్రమైన నీటిని తాగించడం, చేతులను శుభ్రంగా కడుక్కోవడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం వంటి మంచి అలవాట్లను చిన్నప్పటి నుంచే నేర్పించాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూపర్వైజర్లు సూచించారు. గర్భధారణ సమయంలో తల్లి తీసుకునే పోషకాహారం తల్లి ఆరోగ్యంతో పాటు గర్భంలోని శిశువు ఎదుగుదలపై కూడా ప్రభావం చూపుతుందని తెలిపారు. బాలింతలు తమకు, తమ శిశువుకు అవసరమైన పోషకాలు అందేలా సమతుల్య ఆహారం తీసుకోవాలని సూచించారు. శిశువులకు తల్లిపాల ప్రాధాన్యతను వివరించడంతో పాటు, వయస్సు పెరుగుతున్న కొద్దీ వైద్యులు, అంగన్వాడీ సిబ్బంది సూచనల మేరకు తగిన అదనపు ఆహారం అందించాలని అవగాహన కల్పించారు. "ఈరోజు పిల్లలకు అందించే మంచి ఆహారమే రేపటి ఆరోగ్యకరమైన తరానికి పెట్టుబడి" అని కార్యక్రమంలో సిబ్బంది పేర్కొన్నారు. పిల్లలకు పోషకాహారం అందించడం అంగన్వాడీ కేంద్రాల బాధ్యత మాత్రమే కాదని, తల్లిదండ్రులు కూడా ఇంటి నుంచే ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లకు పునాది వేయాలని సూచించారు. సరైన ఆహారం, పరిశుభ్రత, ఆరోగ్యకరమైన జీవనశైలిని చిన్నారులకు అలవాటు చేస్తే వారు ఆరోగ్యంగా ఎదిగి భవిష్యత్తులో సమాజానికి బలమైన పునాదిగా నిలుస్తారని తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు సుమిత్ర, వకుళదేవి, అనిత, సబిత, రత్న, సహాయకురాలు సునితతో పాటు గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు అవసరమైన సూచనలు అందిస్తూ, పోషకాహార ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.

# ఆర్టీసీ విలీనమే లక్ష్యం..

**కార్మికుల హక్కుల కోసం పోరాటం: నిర్మల జగ్గారెడ్డి**

**కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాటం**

**గద గుర్తుకు ఓటేయండి.. హనుమంతును గెలిపించండి**

**కార్మికుల సమస్యల పరిష్కారమే టిజెఎంయు ధ్యేయం**

**కాంగ్రెస్ హామీలతో ఆర్టీసీ విలీనంపై ఆశలు**

**సంగారెడ్డిలో టిజెఎంయు కి మద్దతుగా భారీ ర్యాలీ**

**గద గుర్తుకు ఓటేసి హనుమంతును గెలిపించాలని పిలుపు**



సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 30: ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియ కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని మాజీ డీసీసీ అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి అన్నారు. ఆర్టీసీ కార్మికుల ఎన్నికల్లో టిజెఎంయు రాష్ట్ర కార్యదర్శి అభ్యర్థి హనుమంతుకు మద్దతుగా బుధవారం సంగారెడ్డిలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో నిర్మల జగ్గారెడ్డితో పాటు టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సంగారెడ్డి డిపో గౌరవ అధ్యక్షుడు తోపాజి అనంత కిషన్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేసి తీరుతుందని స్పష్టం చేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలన్న కార్మికుల ఆకాంక్షను నెరవేర్చేందుకు ఎన్నికల అనంతరం ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. గత ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల సమస్యలను పట్టించుకోలేదని విమర్శించారు. కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న హనుమంతు మంచి వ్యక్తి అని పేర్కొంటూ, అక్టోబర్ 9న జరిగే ఆర్టీసీ కార్మికుల ఎన్నికల్లో గదా గుర్తుకు ఓటు వేసి హనుమంతును గెలిపించాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం హనుమంతు చేస్తున్న పోరాటానికి అండగా నిలవాలని కోరారు.టిజెఎంయు రాష్ట్ర కార్యదర్శి అభ్యర్థి హనుమంతు మాట్లాడుతూ.. ఆర్టీసీ విలీనాన్ని ఇతర సంఘాల నాయకులు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. కార్మికుల అవసరాలను ఆసరాగా చేసుకుని చందాల రూపంలో డబ్బులు వసూలు చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అండతో టిజెఎంయు విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేస్తూ, కార్మికుల సమస్యల పరిష్కారం, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం కోసం తమ సంఘం నిరంతరం పోరాడుతుందని తెలిపారు. సంగారెడ్డిలో నిర్వహించిన ర్యాలీలో పలువురు టిజెఎంయు నాయకులు, ఆర్టీసీ కార్మికులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా బీజేపీ ఆందోళన

**ఉప్పర్‌పల్లి చౌరస్తాలో సీఎం దిష్టిబొమ్మ దహనం.. క్షమాపణ చెప్పాలని డిమాండ్**

గండిపేట(క్రైమ్ మిర్రర్): తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి హిందూ దేవుళ్లపై చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ రాజేంద్రనగర్ డివిజన్ బీజేపీ ఆధ్వర్యంలో ఉప్పర్‌పల్లి చౌరస్తాలో ఆందోళన నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడు పసుపుల సందీప్ ముదిరాజ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో రేవంత్ రెడ్డి శ్రీరాముడు ధనికుల దేవుడని, శివుడు పేదల దేవుడని వ్యాఖ్యానించినట్లు వార్తలు వెలువడ్డాయి. అలాగే ఉత్తరాది ప్రాంతాల్లో శ్రీరాముడిని, దక్షిణాదిలో శివుడిని ఎక్కువగా ఆరాధిస్తారని ఆయన వ్యాఖ్యానించినట్లు పలు మీడియా సంస్థలు పేర్కొన్నాయి. ఈ వ్యాఖ్యలపై బీజేపీ నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. హిందూ దేవుళ్లను వర్గాల వారీగా విభజించేలా వ్యాఖ్యలు చేయడం సరికాదని పేర్కొంటూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హిందూ సమాజానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు కూడా సీఎం వ్యాఖ్యలను ఖండించి, శ్రీరాముడు--శివుడి మధ్య ఎలాంటి భేదం లేదని పేర్కొంటూ క్షమాపణ కోరారు. ఉప్పర్‌పల్లి చౌరస్తాలో నిర్వహించిన నిరసనలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు సీఎం వ్యాఖ్యలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. హిందూ దేవతలను రాజకీయ వ్యాఖ్యల్లోకి తీసుకురావడం వల్ల ప్రజల మనోభావాలు దెబ్బతింటాయని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గోల్కొండ జిల్లా ఇన్‌చార్జి వై. శ్రీధర్, వనపర్తి ఇన్‌చార్జి బాల్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి మల్లేష్ యాదవ్, జిల్లా ఆఫీస్ సెక్రటరీ షాబాద్ విజయ్, వనితా రెడ్డి, విట్టల్, బాబురావు, బాలకృష్ణ, మల్లేష్‌చారి, పవన్, రాజశేఖర్ రెడ్డి, రాకేష్ గౌడ్, సరితా రెడ్డి, వెంకటేష్, విజయ్ యాదవ్, సప్నారెడ్డి, వేణుగోపాల్, సుధాకర్ రెడ్డి, షేక్ బాషా, పి. నరేందర్, భూపాల్ ముదిరాజ్, జయప్రకాశ్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, బాలసాయి, మనోజ్‌తో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా, సీఎం వ్యాఖ్యలను కాంగ్రెస్ నేతలు మరో విధంగా వివరిస్తూ.. అవి మత విశ్వాసాలను విభజించడం ఉద్దేశం కాదని, రాజకీయాల్లో మత విశ్వాసాల వినియోగంపై చేసిన వ్యాఖ్యలని చెబుతున్నారు .

## అగ్రివర్సిటీలో ఘనంగా మహాత్మా గాంధీ జయంతి వేడుకలు

**అక్టోబర్ 2న 157వ జయంతి ఉత్సవాలు..**

**ముఖ్య అతిథిగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** జాతిపిత మహాత్మా గాంధీ 157వ జయంతి ఉత్సవాలను ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఘనంగా నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య తెలిపారు. అక్టోబర్ 2వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు రాజేంద్రనగర్‌లోని విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ వేడుకలకు తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు ఉపకులపతి తెలిపారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి, స్థానిక ఎమ్మెల్యే టి. ప్రకాశ్ గౌడ్, ఎమ్మెల్సీ బి. మహేష్‌కుమార్ గౌడ్ గౌరవ అతిథులుగా పాల్గొంటారని పేర్కొన్నారు. అదేవిధంగా ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు ఉన్నం వెంకయ్య, జి. నర్సయ్య, గాంధీయన్ స్కాలర్ డాక్టర్ ఏ. రఘుకుమార్ ప్రత్యేక అతిథులుగా కార్యక్రమంలో పాల్గొంటారని అల్దాస్ జానయ్య వివరించారు. విద్యార్థుల్లో మహాత్మా గాంధీ సిద్ధాంతాలు, ఆశయాలు, విలువలపై అవగాహన కల్పించడమే జయంతి వేడుకల ప్రధాన ఉద్దేశమని ఉపకులపతి తెలిపారు. గాంధీజీ చూపిన సత్యం, అహింస, నైతిక విలువలను యువతకు పరిచయం చేయడంతో పాటు, వాటి ప్రాధాన్యతను వివరించేలా కార్యక్రమాలను రూపొందించినట్లు చెప్పారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రత్యేక పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంపిక చేసి బహుమతులు అందజేయనున్నట్లు ఉపకులపతి వెల్లడించారు. యువతలో గాంధీ సిద్ధాంతాలపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు, దేశ నిర్మాణంలో నైతిక విలువల ప్రాధాన్యతను తెలియజేయడం ఈ కార్యక్రమాల లక్ష్యమని పేర్కొన్నారు. మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొని విజయవంతం చేయాలని ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య కోరారు.

# ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలి

**శంషాబాద్ సిద్ధాంతి వద్ద శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజావాణిలో వినతి.. ఎయిర్‌పోర్ట్ కాలనీ విద్యుత్, మున్సిపల్ సమస్యలపైనా ఫిర్యాదు**



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** శంషాబాద్ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతూ ప్రజావెలుగు పార్టీ టీం ఆధ్వర్యంలో సీఏంఓ క్యాంప్ ఆఫీస్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. ముఖ్యంగా జాతీయ రహదారిపై సిద్ధాంతి ప్రాంతంలో తరచూ జరుగుతున్న ప్రమాదాలను నివారించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని హైదరాబాద్ ట్రాఫిక్ కమిషనర్, ఆర్అండ్‌బీ సబ్ డివిజనల్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేశారు. జాతీయ రహదారిపై సిద్ధాంతి ప్రాంతంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, దీంతో స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. రహదారి దాటే సమయంలో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రమాదాల నివారణకు కేవలం తాత్కాలిక చర్యలు కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను కోరారు. అదేవిధంగా సంగీతా మొబైల్, సవేరా హోటల్ ప్రాంతాల్లో రోడ్డు దాటే సమయంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా హైదరాబాద్ ట్రాఫిక్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణ, ప్రజలు సురక్షితంగా రోడ్డు దాటేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఎయిర్‌పోర్ట్ కాలనీలో విద్యుత్ భద్రతకు సంబంధించిన పలు సమస్యలను కూడా ప్రజావాణిలో అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద తగిన భద్రతా చర్యలు చేపట్టాలని, విద్యుత్ వైర్లకు అవసరమైన సేఫ్‌గార్డులు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే విద్యుత్ వైర్లకు అడ్డుగా పెరిగిన చెట్ల కొమ్మలను ఎప్పటికప్పుడు కటింగ్, ట్రిమ్మింగ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. విద్యుత్ వైర్లకు చెట్ల కొమ్మలు తగలడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున సంబంధిత అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. శంషాబాద్ కరెంట్ ఆఫీస్‌కు సంబంధించిన అధికారులు ప్రజలు ఫిర్యాదు చేస్తున్న సమస్యలపై తగిన స్థాయిలో స్పందించడం లేదని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్లు ప్రజావెలుగు పార్టీ ప్రతినిధులు తెలిపారు. ప్రజల భద్రతకు సంబంధించిన విద్యుత్ సమస్యలను ప్రాధాన్యతగా తీసుకుని పరిష్కరించాలని కోరారు. ఎయిర్‌పోర్ట్ కాలనీలోని వివిధ సమస్యలపై సుమారు రెండు నెలల క్రితం అధికారులకు వినతిపత్రం సమర్పించినప్పటికీ ఇప్పటివరకు తీసుకున్న చర్యలపై స్పష్టత లేదని వారు పేర్కొన్నారు. ఈ అంశంపై కూడా మరోసారి ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించి, సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యలను పరిశీలించాలని కోరారు. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యంతో సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించడం లేదని, కొన్ని చోట్ల నాణ్యత లేని పైపై పనులతో సమస్యలను పరిష్కరించినట్లు చూపుతున్నారని వారు ఆరోపించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన పనులు చేపట్టి సమస్యలు పూర్తిగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. శంషాబాద్ ప్రజలు, ముఖ్యంగా ఎయిర్‌పోర్ట్ కాలనీ వాసులు ఎదుర్కొంటున్న రహదారి, ట్రాఫిక్, విద్యుత్, మున్సిపల్ సమస్యలపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజావెలుగు పార్టీ టీం కోరింది.

## ఎంజీఐటీలో రెండు రోజుల ప్రాయోగిక డ్రోన్ వర్క్‌షాప్

**డ్రోన్ టెక్నాలజీపై విద్యార్థులకు ప్రత్యక్ష శిక్షణ**



గండిపేట(క్రైమ్ మిర్రర్): మహాత్మా గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ)లోని మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో బీటెక్ ద్వితీయ, తృతీయ, చతుర్థ సంవత్సరం విద్యార్థుల కోసం రెండు రోజుల ప్రాయోగిక డ్రోన్ వర్క్‌షాప్‌ను నిర్వహించారు. అభివృద్ధి చెందుతున్న డ్రోన్ సాంకేతికతపై విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు, డ్రోన్‌ల అసెంబ్లీ, సెన్సర్ల అనుసంధానం, కాలిబ్రేషన్, కాన్ఫిగరేషన్, ఆపరేషన్ వంటి అంశాల్లో ప్రత్యక్ష అనుభవాన్ని అందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశంగా నిలిచింది. మెకానికల్ ఇంజినీరింగ్, మెకాట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగాలకు చెందిన మొత్తం 75 మంది విద్యార్థులు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొని శిక్షణ పొందారు. కార్యక్రమంలో డ్రోన్ సాంకేతికతకు సంబంధించిన ప్రాథమిక అంశాలతో పాటు వివిధ రకాల భాగాలు, సెన్సర్ల పనితీరు, వాటి అనుసంధానం, డ్రోన్ అసెంబ్లీ విధానం, కాలిబ్రేషన్, ఫ్లైట్ కంట్రోల్, కాన్ఫిగరేషన్ తదితర అంశాలను ప్రాయోగికంగా వివరించారు. ఈ వర్క్‌షాప్‌కు సంస్థకు చెందిన శ్రీ పి. శ్రీనివాస్ రెడ్డి రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు. పరస్పర చర్చలు, ప్రత్యక్ష ప్రదర్శనలు, ప్రాయోగిక శిక్షణ ద్వారా విద్యార్థులకు డ్రోన్‌ల సాంకేతిక నిర్మాణం, సెన్సర్ల అనుసంధానం, అసెంబ్లీ, కాలిబ్రేషన్, కాన్ఫిగరేషన్, నిర్వహణకు సంబంధించిన అంశాలను వివరించారు. వర్క్‌షాప్‌లో భాగంగా విద్యార్థులు స్వయంగా డ్రోన్‌లను కాన్ఫిగర్ చేయడంతో పాటు వాటి నిర్వహణ, ఆపరేషన్‌పై శిక్షణ పొందారు. అనంతరం ప్రత్యక్ష విమాన ప్రదర్శనల్లో పాల్గొని డ్రోన్‌లను విజయవంతంగా నిర్వహించారు. దీంతో పుస్తక పరిజ్ఞానానికి పరిమితం కాకుండా డ్రోన్ సాంకేతికతపై క్షేత్రస్థాయి అనుభవాన్ని పొందే అవకాశం విద్యార్థులకు లభించింది. డ్రోన్ టెక్నాలజీ ప్రస్తుతం వైమానిక వ్యవస్థలు, ఆటోమేషన్, మానవరహిత వైమానిక వాహనాలు తదితర రంగాల్లో విస్తృతంగా వినియోగంలోకి వస్తున్న నేపథ్యంలో ఇటువంటి ప్రాయోగిక శిక్షణ కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. తరగతి గదిలో నేర్చుకున్న సైద్ధాంతిక అంశాలను వాస్తవ ప్రపంచ అనువర్తనాలతో అనుసంధానించేందుకు ఈ వర్క్‌షాప్ ఒక వేదికగా నిలిచింది. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు డ్రోన్ సాంకేతికతపై తమ అవగాహనను మరింత బలోపేతం చేసుకోవడంతో పాటు, భవిష్యత్తులో వైమానిక సాంకేతికత, ఆటోమేషన్, రోబోటిక్స్, సంబంధించిన రంగాల్లో ఉన్న అవకాశాలను అన్వేషించేందుకు ప్రోత్సాహం పొందారు. సాంకేతిక విద్యలో ప్రాయోగిక నైపుణ్యాలకు ప్రాధాన్యతనిస్తూ నిర్వహించిన ఈ రెండు రోజుల వర్క్‌షాప్ విద్యార్థుల్లో ఆసక్తిని పెంచింది.

## భూముల రీ సర్వే ప్రక్రియలో ఎలాంటి అవకతవకులు లేకుండా సర్వే చేయాలి

**లైసెన్స్ సర్వేయర్లు భాగస్వాములు కావాలి: జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



**వనపర్తి సెప్టెంబర్ 30 క్రైమ్ మిర్రర్:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వే కార్యక్రమంలో లైసెన్స్ సర్వేయర్లు భాగస్వాములై, ప్రభుత్వానికి సహకరించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో భూముల రీసర్వే అంశంపై లైసెన్స్ సర్వేయర్లతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రీసర్వే ప్రక్రియ, లైసెన్స్ సర్వేయర్ల భాగస్వామ్యం తదితర అంశాలపై వారికి పలు సూచనలు చేశారు. కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ ప్రభుత్వం భూముల రీసర్వేను ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని, ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసేందుకు లైసెన్స్ సర్వేయర్ల సహకారం ఎంతో అవసరమని తెలిపారు. ప్రభుత్వం లైసెన్స్ సర్వేయర్లకు వేతనాలు చెల్లిస్తామని చెప్పలేదని, రీసర్వే పనులకు ఎకరాకు రూ.60 చొప్పున పారితోషికం అందిస్తుందని తెలిపారు. సర్వేయర్లు కష్టపడి, నైపుణ్యంతో పనిచేస్తే మంచి ఆదాయం పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.రీసర్వే పనుల్లో ప్రభుత్వానికి సహకరిస్తూ ముందుకు రావాలని కలెక్టర్ కోరారు. ప్రభుత్వ కార్యక్రమాలకు సహకరించకపోతే, నిబంధనల ప్రకారం లైసెన్స్‌లపై చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు.లైసెన్స్ సర్వేయర్లకు రీసర్వే కార్యక్రమం మంచి ఉపాధి అవకాశాన్ని కల్పించడంతో పాటు, తమ నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు ఉపయోగపడుతుందని కలెక్టర్ తెలిపారు. రీసర్వే పనుల్లో అనుభవం, నైపుణ్యాలను పెంచుకోవడం ద్వారా భవిష్యత్తులో మార్కెట్‌లో వారి వృత్తిపరమైన విలువ మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అవసరమైన సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలోఅదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్, సర్వే శాఖ ఏడీ శ్రీనివాసులు ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు

# శిక్షణతోనే సమర్థ పోలీస్ నాయకత్వం

## ప్రొబేషనరీ డీఎస్పీలకు డీజీపీ సీ.వీ. ఆనంద్ దిశానిర్దేశం

గండిపేట(క్రైమ్ మిర్రర్):పోలీస్ అధికారుల కెరీర్‌కు శిక్షణే పునాది అని తెలంగాణ డీజీపీ సీ.వీ. ఆనంద్ అన్నారు. క్రమశిక్షణ, నిబద్ధత, నాయకత్వ లక్షణాలతో పాటు నైతిక విలువలను పాటిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించే అధికారులుగా ఎదగాలని ప్రొబేషనరీ డీఎస్పీలకు సూచించారు. విధి నిర్వహణలో చట్ట పరిజ్ఞానంతో పాటు మానవీయ దృక్పథం, సాంకేతిక పరిజ్ఞానం, శారీరక--మానసిక దృఢత్వం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఆర్‌బీవీఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న 112 మంది ప్రొబేషనరీ డీఎస్పీలతో డీజీపీ సీ.వీ. ఆనంద్ బుధవారం ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. సుమారు గంటన్నరపాటు జరిగిన ఈ కార్యక్రమంలో పోలీస్ నాయకత్వం, విధి బాధ్యతలు, నైతిక విలువలు, ప్రజలతో వ్యవహరించే తీరు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం తదితర అంశాలపై ఆయన విస్తృతంగా దిశానిర్దేశం చేశారు. పదవిలో ఉన్నంత మాత్రాన నాయకత్వ లక్షణాలు వచ్చినట్లు కాదని డీజీపీ సీ.వీ. ఆనంద్ అన్నారు. సమర్థవంతమైన నాయకుడిగా ఎదగడానికి ధైర్యం, స్పష్టమైన దార్శనికత, సమగ్రత, విలువలు, నైతికత, బృంద స్ఫూర్తి, నిష్పక్షపాత వైఖరి, సమర్థమైన కమ్యూనికేషన్ నైపుణ్యాలు అవసరమని వివరించారు. కష్టపడి పనిచేసే తత్వంతో పాటు సాంకేతిక పరిజ్ఞానం, సృజనాత్మకత, వినయం కూడా నాయకత్వంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. యువ అధికారులు ముఖ్యంగా నైతిక విలువలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. విధి నిర్వహణలో జరిగే చిన్న పొరపాటు కూడా భవిష్యత్తులో అధికారుల ప్రతిష్ఠపై ప్రభావం చూపే అవకాశం ఉందని హెచ్చరించారు. పోలీస్ సర్వీసులో సుదీర్ఘంగా పనిచేయాల్సి ఉంటుందని, అందువల్ల ప్రతి అధికారి తన వ్యక్తిగత, వృత్తిపరమైన ప్రతిష్ఠను కాపాడుకోవడం అత్యంత ముఖ్యమని అన్నారు. శిక్షణ





పూర్తయిన అనంతరం క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేలా ప్రొబేషనర్లు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని డీజీపీ సూచించారు. ప్రజలతో వ్యవహరించే తీరు, నేరాల దర్యాప్తు, చట్టాల అమలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పోలీసింగ్‌లో వినియోగించడం వంటి అంశాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలని చెప్పారు. కేవలం చట్టాలపై పరిజ్ఞానం ఉంటేనే మంచి పోలీస్ అధికారి కాలేరని, నాయకత్వం, మానవీయ దృక్పథం, దర్యాప్తు నైపుణ్యం, సాంకేతిక అవగాహన, శారీరక దృఢత్వం, ప్రజలతో సమర్థవంతమైన కమ్యూనికేషన్ కూడా అవసరమని పేర్కొన్నారు. ప్రజలకు భద్రత కల్పించడం, వారికి సకాలంలో న్యాయం అందేలా చూడటమే పోలీసింగ్ ప్రధాన లక్ష్యమని డీజీపీ స్పష్టం చేశారు. తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ మాట్లాడుతూ.. ప్రొబేషనరీ డీఎస్పీల ప్రొఫెషనల్ కోర్సులో 74 మంది పురుషులు, 38 మంది మహిళలు కలిపి మొత్తం 112 మంది శిక్షణ పొందుతున్నారని తెలిపారు. సుమారు 10 నెలలపాటు కొనసాగే ఈ శిక్షణలో ఇండోర్, అవుట్‌డోర్ శిక్షణకు సమాన ప్రాధాన్యం ఇస్తున్నట్లు వివరించారు. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), క్రిమినల్ లా, క్రిమినాలజీతో పాటు నేర దర్యాప్తు, మోడల్ పోలీసింగ్, ఆస్తి సంబంధిత నేరాలు, ఆర్థిక నేరాలపై ప్రత్యేక శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. సీనియర్ పోలీస్ అధికారులు, వివిధ రంగాలకు చెందిన నిపుణులతో తరగతులు నిర్వహిస్తున్నామని చెప్పారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రాక్టికల్ శిక్షణలో భాగంగా కాంబాట్ వ్యాయామాలు, గుర్రపు స్వారీ, ఈత, వివిధ రకాల ఆయుధాల వినియోగంపై కూడా శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం 5వ తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్--2026 క్లస్టర్--సీలో విజేతలకు డీజీపీ సీ.వీ. ఆనంద్ పతకాలు, బహుమతులు అందజేశారు. సెప్టెంబరు 28న ప్రారంభమైన మూడు రోజుల క్రీడా పోటీలు బుధవారం ముగిశాయి. బ్యాడ్మింటన్, లాన్ టెన్నిస్, టేబుల్ టెన్నిస్ తదితర పోటీల్లో కానిస్టేబుల్ స్థాయి నుంచి ఐపీఎస్ అధికారులు వరకు 700 మందికి పైగా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీవీఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్, ఐజీపీ గజరావు భూపాల్, డిప్యూటీ డైరెక్టర్లు చేతన, మురళీధర్, వెంకటేశ్వర్లు, కేఆర్‌కే ప్రసాద్, అసిస్టెంట్ డైరెక్టర్లు వేమా శ్రీనివాసరెడ్డి, భారత్, వేముల శ్రీనివాసరావు, డీఎస్పీలు పీజీ రెడ్డి, సతీష్, ఆదూరి శ్రీనివాసరావు, సందీప్‌రెడ్డి, అమృత్‌రెడ్డి, దేవారెడ్డి, యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమాదేవి, ఓఎస్‌డీ వెంకట్రావు, ఇతర అధికారులు, అకాడమీ సిబ్బంది, ట్రైనీ ప్రొబేషనరీ డీఎస్పీలు పాల్గొన్నారు.

# గౌల్‌దొడ్డిలో 111 జీవోకు తూట్లు..!

**ప్రధాన రహదారి పక్కనే భారీ షెడ్డు నిర్మాణం**
**అనుమతులపై స్పష్టత ఇవ్వాలంటున్న స్థానికులు..**

**అధికారుల తనిఖీ ఎప్పుడు..?**

గండిపేట్,(క్రైమ్ మిర్రర్): 111 జీవో పరిధిలో నిర్మాణాలపై ప్రత్యేక నిబంధనలు అమల్లో ఉన్నప్పటికీ.. నాశనం చేశారు గౌల్‌దొడ్డి ప్రాంతంలో భారీ షెడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయనే ఆరోపణలు స్థానికంగా కలకలం రేపుతున్నాయి. గౌల్‌దొడ్డికి వెళ్లే ప్రధాన కూడలి సమీపంలో, అనమయ్య కన్వెన్షన్ పక్కనే పెద్దఎత్తున నిర్మాణ పనులు జరుగుతున్నప్పటికీ సంబంధిత పట్టణ ప్రణాళిక అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రధాన రహదారికి ఆనుకుని నిర్మాణ పనులు సాగుతున్నా అధికారులు కనీసం స్థల పరిశీలన చేయకపోవడంపై స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కళ్లముందే భారీ నిర్మాణం జరుగుతున్నప్పటికీ అధికారులు ఎందుకు స్పందించడం లేదన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. నిర్మాణానికి మంజూరైన అనుమతులు ఏమిటి? స్థల వినియోగానికి అనుమతి ఉందా? నిర్మాణ ప్రణాళికను సంబంధిత సంస్థలు ఆమోదించాయా? 111 జీవో పరిధిలో వర్తించే నిబంధనలను పాటిస్తున్నారా? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. నిర్మాణ పనులు ప్రారంభమైన దశలోనే అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా లేదా అన్నది నిర్ధారించాల్సి ఉండగా.. పనులు ముందుకు సాగుతున్నా అధికారులు స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని స్థానికులు అంటున్నారు. 111 జీవో



పరిధిలో పర్యావరణ పరిరక్షణ, భూవినియోగం, నిర్మాణాల విషయంలో ప్రత్యేక నిబంధనలు అమల్లో ఉన్న నేపథ్యంలో.. సంబంధిత అధికారులు వాటి అమలుపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొంటున్నారు. అయితే గౌల్‌దొడ్డి ప్రాంతంలో భారీ షెడ్డు నిర్మాణం జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నప్పటికీ ఇప్పటివరకు అధికారులు స్పందించకపోవడంపై స్థానికులు ప్రశ్నిస్తున్నారు. సాధారణ నిర్మాణాల విషయంలో తనిఖీలు, నోటీసులు జారీ చేసే అధికారులు.. ప్రధాన కూడలి వద్ద భారీ నిర్మాణం జరుగుతున్నా ఎందుకు మౌనం వహిస్తున్నారని వారు నిలదీస్తున్నారు. నిర్మాణానికి సంబంధించిన భవన అనుమతులు, భూ వినియోగ వివరాలు, మంజూరైన నిర్మాణ ప్రణాళిక, సంబంధిత శాఖల అనుమతులు తదితర వివరాలను అధికారులు బహిర్గతం చేయాలని స్థానికులు కోరుతున్నారు. అనుమతులు ఉన్నట్లయితే వాటి వివరాలను వెల్లడించాలని, లేకపోతే ఏ నిబంధనల ఆధారంగా నిర్మాణం కొనసాగుతోందో స్పష్టం చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. నిర్మాణం నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు తేలితే వెంటనే పనులను నిలిపివేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. నిర్మాణం పూర్తయిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే.. ప్రస్తుతం జరుగుతున్న పనులపైనే క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించి వాస్తవాలను నిర్ధారించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. పట్టణ ప్రణాళిక అధికారులతో పాటు రెవెన్యూ, హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ అధికారులు కూడా సంయుక్తంగా స్థలాన్ని పరిశీలించి భూమి స్వరూపం, భూ వినియోగం, నిర్మాణ అనుమతులు, నిర్మాణ ప్రణాళిక తదితర అంశాలను తనిఖీ చేయాలని స్థానికులు కోరుతున్నారు. నిర్మాణం నిబంధనలకు విరుద్ధంగా ఉందని ఫిర్యాదులు వచ్చినా అధికారులు స్పందించకపోతే భవిష్యత్తులో సమస్య తలెత్తినప్పుడు బాధ్యత ఎవరిదన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయని వారు అంటున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి నిర్మాణంపై సమగ్ర విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. 111 జీవో పరిధిలో నిర్మాణాలపై నిబంధనలు అమల్లో ఉన్నప్పుడు.. గౌల్‌దొడ్డిలో భారీ షెడ్డు నిర్మాణంపై వచ్చిన ఆరోపణలపై అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారని వారు ప్రశ్నిస్తున్నారు. నిర్మాణానికి అన్ని అనుమతులు ఉన్నట్లయితే వాటిని స్పష్టం చేస్తారా? నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే వెంటనే చర్యలు తీసుకుంటారా? అనే ప్రశ్నలకు సంబంధిత అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి వాస్తవాలను వెల్లడించాలని, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరుగుతున్నట్లు తేలితే వెంటనే పనులు నిలిపివేసి బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# డాక్టర్ దశరథ్ ఎంఎస్‌కు అరుదైన గౌరవం

**ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా డైరెక్టర్‌గా నియామకం.. అభినందనల వెల్లువ**

**కోదాడ సెప్టెంబర్ 30 ( క్రైమ్ మిర్రర్ ):** కోదాడ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్, సీనియర్ సర్జన్, తెలంగాణ ఉద్యమకారుడు డాక్టర్ దశరథ్ ఎంఎస్‌కు అరుదైన గౌరవం దక్కింది. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా డైరెక్టర్‌గా ఆయన నియమితులయ్యారు. ఈ మేరకు రెడ్‌క్రాస్ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. నియామకంపై జిల్లా వ్యాప్తంగా వైద్యులు, రెడ్‌క్రాస్ సభ్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, తెలంగాణ ఉద్యమకారులు హర్షం వ్యక్తం చేస్తూ డాక్టర్ దశరథ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.వైద్య రంగంలో సీనియర్ సర్జన్‌గా విశేష అనుభవం ఉన్న డాక్టర్ దశరథ్.. ప్రభుత్వ వైద్య సేవలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొంటున్నారు. కోదాడ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆస్పత్రిలో మౌలిక వసతుల కల్పన, పారిశుద్ధ్యం, రోగులకు మెరుగైన వైద్య సేవల అందించడంలో కీలకంగా పనిచేస్తున్నారు. కరోనా విపత్కర సమయంలోనూ ప్రాణాలకు తెగించి ప్రజలకు వైద్య సేవలు అందించారు.నిరుపేదలకు ఉచిత వైద్యం, రక్తదాన శిబిరాలు, అవయవదానంపై అవగాహన కార్యక్రమాలు, గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాల నిర్వహణలో ఆయన సేవలు ప్రశంసలు అందుకున్నాయి. ఇదే సమయంలో కోదాడకు చెందిన సామాజిక కార్యకర్త కొమరగిరికి కూడా రెడ్‌క్రాస్ డైరెక్టర్ పదవి లభించింది.ఈ సందర్భంగా డాక్టర్ దశరథ్ ఎంఎస్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రెడ్‌క్రాస్ సొసైటీకి కృతజ్ఞతలు తెలిపారు. రెడ్‌క్రాస్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు మరింత చేరువగా పనిచేస్తానని పేర్కొన్నారు. కొమరగిరి



రంగారావుకి రెడ్‌క్రాస్ డైరెక్టర్‌గా బాధ్యతలు కోదాడ పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త కొమరగిరి రంగారావుకి కూడా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ డైరెక్టర్‌గా నియామకం లభించింది. సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న ఆయన సేవలను గుర్తించిన రెడ్‌క్రాస్ సొసైటీ ఈ బాధ్యతలను అప్పగించింది. నిరుపేదలకు ఉచిత వైద్య సేవలు అందించడం, రక్తదాన శిబిరాలు నిర్వహించడం, అవయవదానంపై ప్రజల్లో అవగాహన కల్పించడం, గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం వంటి కార్యక్రమాల్లో కొమరగిరి విశేషంగా సేవలందిస్తున్నారు. ఆయనకు డైరెక్టర్‌గా బాధ్యతలు అప్పగించడంపై పలువురు అభినందనలు



## అంగన్వాడీ కేంద్రాల్లో సమయపాలన తప్పనిసరి

మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, సెప్టెంబరు 30: అంగన్వాడీ కేంద్రాల నిర్వహణలో సమయపాలన తప్పనిసరిగా పాటించాలని ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ కె.నాగమణి సూచించారు. బండమీదిగూడెం సెక్టార్ అంగన్వాడీ టీచర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు.ప్రతిరోజూ అంగన్వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, మెనూ ప్రకారం లబ్ధిదారులకు పౌష్టికాహారం వండి అందించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల ప్రాధాన్యంపై తల్లిదండ్రులు, పెద్దలకు అవగాహన కల్పించి.. ప్రీస్కూల్ పిల్లల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆన్‌లైన్ యాప్‌లలో వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని చెప్పారు.సెప్టెంబరు 9 నుంచి అక్టోబరు 8 వరకు నిర్వహిస్తున్న 9వ జాతీయ పోషణ మాసం కార్యక్రమాలను షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని నాగమణి కోరారు. 3 నుంచి 6 ఏళ్ల పిల్లల్లో పాఠశాల సంసిద్ధత కార్యక్రమంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించడంతో పాటు, ఈసీసీఈ డే ప్రాధాన్యాన్ని వివరించాలని సూచించారు. స్థానికంగా లభించే చిరుధాన్యాలు, ఆకుకూరలు, పండ్లను ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. పరిశుభ్రత, పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించాలని తెలిపారు.ప్రకాశ్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు డాక్టర్ నిపున్ మాట్లాడుతూ.. వైరల్ జ్వరాలు వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. గర్భిణులు, బాలింతలు పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలని, రక్తహీనతకు దూరంగా ఉండేలా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సమతుల ఆహారం ప్రాధాన్యాన్ని వివరించారు.కార్యక్రమంలో సెక్టార్ టీచర్లు ఐ.సైదమ్మ, జె.లక్ష్మి, సత్యలక్ష్మి, భాగ్యలక్ష్మి, నాగూర్, ఉమామహేశ్వరి, మారెమ్మ, లక్ష్మి, మాధవి, మంజుల, నాగమ్మ, వెంకటమ్మ, రాణి, అలివేలు తదితరులు పాల్గొన్నారు.15వ వార్డు అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో కౌన్సిలర్ ఆర్.కె.శ్రీజ, అంగన్వాడీ టీచర్లు టి.అరుణ, వై.నాగమణి, ఆయాలు బి.లక్ష్మీకాంతం, రజియాబేగం, తల్లులు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

## వాటర్‌మెన్‌లకు జీహెచ్‌ఎంసీ కార్మికులతో సమాన వేతనాలు ఇవ్వాలి



గండిపేట్,(క్రైమ్ మిర్రర్): శంషాబాద్‌లో గత 25 ఏళ్లుగా ప్రజలకు తాగునీటి సేవలు అందిస్తున్న వాటర్‌మెన్‌లకు జీహెచ్‌ఎంసీ కార్మికులతో సమానంగా వేతనాలు చెల్లించాలని తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు చిన్నగండు రాజేందర్ డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ నుంచి జీహెచ్‌ఎంసీ వరకు ఎండ, వాన లెక్కచేయకుండా రాత్రింబవళ్లు విధులు నిర్వహిస్తున్న కార్మికులకు తగిన వేతనాలు అందకపోవడం బాధాకరమన్నారు. 25 ఏళ్లుగా సేవలందిస్తున్న వారి కష్టాన్ని గుర్తించి సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించి వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా ఇవ్వాలని కోరారు. దీర్ఘకాలంగా ప్రజలకు సేవలందిస్తున్న వాటర్‌మెన్‌ల సమస్యలను అధికారులు మానవతా దృక్పథంతో పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## శంషాబాద్‌లో భారీగా మత్తు పదార్థాల విక్రయం.. ముగ్గురి అరెస్ట్










**గండిపేట్,(క్రైమ్ మిర్రర్):** శంషాబాద్‌లో భారీగా మత్తు పదార్థాలు విక్రయిస్తున్న ముగ్గురు పెడ్లర్లను ఆర్జీఐఏ పోలీసులు అరెస్ట్ చేశారు. సంపత్ నగర్ రోడ్‌లోని హెచ్‌ఎండీఏ నర్సరీ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న బషారత్ నగర్‌కు చెందిన డ్రైవర్ సయ్యద్ సయీద్ హుస్సేన్ అలియాస్ లంబా, కార్ డ్రైవర్ మహమ్మద్ ఇమ్రాన్, జెప్టో డెలివరీ బాయ్ రహ్మానుద్దీన్‌లను అదుపులోకి తీసుకుని సోదాలు నిర్వహించారు. వారి నుంచి 80 గ్రాముల మెథాంఫెటమైన్, 4 ఎల్ఎస్డీ బ్లాట్స్, 4 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు లంబా బెంగళూరుకు చెందిన పెడ్లర్ జంషెడ్ నుంచి డ్రగ్స్ తెప్పించుకుని మిగతా ఇద్దరి ద్వారా స్థానికంగా అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. లంబాపై ఇప్పటికే 270కి పైగా చోరీ కేసులు, ఇమ్రాన్‌పై మూడు ఎన్డీపీఎస్ కేసులు ఉన్నాయి. పరారీలో ఉన్న ప్రధాన పెడ్లర్ జంషెడ్, సబ్ పెడ్లర్ సయ్యద్ జోహైర్ మెహదీ కోసం గాలింపు చేపడుతూ, ఆర్జీఐఏ పోలీస్ స్టేషన్‌లో ఎన్డీపీఎస్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# వృద్ధ దంపతుల రిజిస్ట్రేషన్ కోసం ఆందోళన..!

## నెల రోజులుగా కార్యాలయం చుట్టూ తిప్పుతున్నా పట్టించుకోని వైనం. .

## 20 గుంటల భూమి రిజిస్ట్రేషన్‌కు రూ.లక్ష కమిషన్ హ. .?

## తహసీల్దార్ తీరుపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని వెల్లడి..









**క్రైమ్ మిర్రర్ (రంగారెడ్డి జిల్లా ప్రతినిధి ):** రంగారెడ్డి జిల్లా అమనగల్ మండలం ఆకుతోటపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 496/అ/ఆలో ఉన్న 20 గుంటల భూమి రిజిస్ట్రేషన్ విషయంలో వృద్ధ దంపతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బాధితుడు వట్టికోట లక్ష్మయ్య ఆరోపించారు. రిజిస్ట్రేషన్ కోసం నెల రోజులుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా సమస్య పరిష్కారం కావడం లేదని పేర్కొన్నారు.లక్ష్మయ్యకు సుమారు నాలుగు ఎకరాల భూమి ఉండగా, అందులో 20 గుంటల భూమికి సంబంధించి హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తితో కుటుంబ సభ్యుల సమక్షంలో అగ్రిమెంట్ చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం రిజిస్ట్రేషన్ ప్రక్రియ కోసం స్లాట్ బుక్ చేసినట్లు చెప్పారు.తనకు ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారని, గత రెండేళ్లుగా కుమారుల నుంచి ఆదరణ లేకపోవడంతో తాను, తన భార్య లక్ష్మమ్మ కుమార్తెల వద్ద ఉంటూ జీవనం సాగిస్తున్నామని లక్ష్మయ్య తెలిపారు. తమకు సంబంధించిన భూమి రిజిస్ట్రేషన్ విషయంలో కొందరు జోక్యం చేసుకుంటూ సమస్యను మరింత జటిలం చేస్తున్నారని ఆరోపించారు.తహసీల్దార్ ఫయీమ్ కార్యాలయానికి పలుమార్లు పిలిపించి రిజిస్ట్రేషన్ చేస్తామని చెప్పి, ఆపరేటర్, డాక్యుమెంట్ రైటర్‌కు తో 1 లక్ష అడిగినట్లు లక్ష్మయ్య ఆరోపించారు. 20 గుంటల భూమి రిజిస్ట్రేషన్ విషయంలో రూ.లక్ష కమిషన్ డీల్ జరిగిందంటూ తనకు సమాచారం ఉందని పేర్కొన్నారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించిన ఆధారాలను అధికారులు పరిశీలించాల్సి ఉంది.తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న పెట్రోల్ బంక్ వద్ద ఆపరేటర్‌తో ఫోన్‌లో డీల్ మాట్లాడినట్లు తనకు అనుమానం ఉందని, అక్కడి సీసీ కెమెరా దృశ్యాలను పరిశీలిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని లక్ష్మయ్య పేర్కొన్నారు.తన భూమి రిజిస్ట్రేషన్ విషయంలో ఎలాంటి న్యాయస్థాన ఆదేశాలు లేకపోయినా రిజిస్ట్రేషన్ నిలిపివేసి కాలయాపన చేస్తున్నారని ఆయన ఆరోపించారు. వృద్ధ దంపతుల పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని జిల్లా కలెక్టర్ స్పందించి పూర్తి స్థాయి విచారణ జరిపించాలని, ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని లక్ష్మయ్య డిమాండ్ చేశారు.



## ఖమ్మం మహిళా పి ఎస్ సిఐ ఉస్మాన్ షరీఫ్ మర్యాదపూర్వకంగా కలిసిన టీజేఏ బృందం

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో :** ఖమ్మం మహిళా పి ఎస్ సిఐ గా బాధ్యతలు చేపట్టిన సిఐ ఉస్మాన్ షరీఫ్ ని తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్(టీజేయు) జిల్లా అధ్యక్షులు నాగ స్వామి టీజేఏ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ ఖాసీం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రషీద్ జిల్లా నాయకులు వాసం రాజేంద్రప్రసాద్ వెంపటి నాయుడు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

## అంగన్వాడి టీచర్ల సేవలు మరువలేనివి సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి



**క్రైమ్ మిర్రర్,సంస్థాన్ నారాయణపురం:-** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో 9వ పోషణ మాసం మన అంగన్ వాడి-మన బాధ్యత సంస్థాన్ నారాయణపూర్ మండస్థాయి కార్యక్రమానికి హాజరైన సంస్థాన్ నారాయణపురం గ్రామ సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ఈ సంవత్సరం 9వ పోషణ మాసశీ సెప్టెంబర్ 9వ తేదీ 2026 నుండి అక్టోబర్ 8వ తేదీ 2026 వరకు విజయవంతం చేయాలని అన్నారు. అంగన్వాడి టీచర్ల సేవలు మరువలేని అని అన్నారు.ఈ కార్యక్రమంలో ఏసీడీపీఓ పారిజాత ఐసిడిఎస్ సూపర్ వైజర్స్ ఎం శోభారాణి, ఎం శ్రీలత , టి . నిర్మల హబ్ డిపార్ట్ మెంట్ కి. భార్గవి,స్కోపు ఎన్జిఓ నర్సింహ్మా, నారాయణపురం మాజీ సర్పంచ్ కొన్ రెడ్డి నరసింహ, యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఉప్పల నాగరాజు, కార్యదర్శి కొండ నవీన్ గౌడ్,అంగన్వాడి టీచర్లు , బాలింతలు, తల్లులు, తదితరులు పాల్గొన్నారు ..

## ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సర్వసభ్య సమావేశం



**క్రైమ్ మిర్రర్, సంస్థాన్ నారాయణపురం:-** ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్ నారాయణపురం ఆవరణంలో సర్వసభ్య సమావేశంకి ముఖ్య అతిథులుగా మండల వ్యవసాయ అధికారి పూజా హాజరై సమావేశంలో రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ సంఘం యొక్క సంవత్సర లావాదేవీలను లాభనష్టాల ఖాతా, ఆస్తి అప్పుల పట్టిక లను కార్యదర్శి బొడ్డుపల్లి శేఖర్ చదివి వినిపించడం జరిగింది. 2025- 26 సంవత్సరం నాటికి ఆడిట్ లెక్కల ప్రకారం సంఘం ఒక కోటి 90 లక్షల లాభంలో ఉన్నది. అదేవిధంగా సంఘంలో ఎరువులు మరియు విత్తనములు, పురుగు మందులు అందుబాటులో కలవు వినియోగించుకోగలరని తెలియజేయడం జరిగింది అదేవిధంగా సంఘం ద్వారా మీసేవ నడుస్తున్నది కావున దాన్ని కూడా సద్వినియోగం చేసుకోగలరని మనవి. అదేవిధంగా రైతులందరూ తీసుకున్నటువంటి రుణాలకు గాను వడ్డీలు ఎప్పటికప్పుడు చెల్లించినట్లయితే సంఘం మరింత అభివృద్ధి బాటలో నడుస్తదని మండల వ్యవసాయ రైతులు ఎల్ నీనో ప్రభావం ఉన్నందున ఆరుతడి పంటలు వేసుకోగలరని తెలియజేయడం జరిగిందిఈ సమావేశంలో రైతులు సంఘాన్ని మరింత అభివృద్ధి పథంలో తీసుకెళ్లాలని సూచించడం జరిగింది . ఈ సమావేశంలో పాలకవర్గం బొడ్డుపల్లి గాలయ్య చెరుకుపల్లి నరసింహ నీళ్ల జంగయ్య బానోతు కిషన్ గడ్డం పాపమ్మ గడ్డం పెంటయ్య మహ్మ దాబాద్ సర్పంచ్ ముత్యాల అంజయ్య సభ్యులు ఏపూరి సత్తయ్య , బెల్లంకొండ శంకరయ్య మందుల బాలకృష్ణ చిలువేరు బిక్షం , గడ్డం యాదగిరి నాతి లక్ష్మణ్ కరెంటు శ్రీను సభ్యులు సంఘ సిబ్బంది తదితరులు పాల్గొనారు

# వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.....

జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్,.. అర్హులైన ప్రతి పట్టభద్రుడిని ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేయాలి

డిగ్రీ, ప్రొఫెషనల్, పీజీ కళాశాలల్లో ప్రత్యేక నమోదు కార్యక్రమాలు నిర్వహించాలి

25 నుంచి 60 ఏళ్ల వయస్సు గల ఓటర్లలో పట్టభద్రులను గుర్తించి నమోదు చేయాలి

ఫారం-18ను పట్టభద్రత ధృవీకరణ పత్రంతో సమర్పించి ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలి

గతంలో 84 వేల మంది నమోదు కాగా, ఈసారి కనీసం 2 లక్షల మంది పట్టభద్రులను నమోదు చేయడమే లక్ష్యం

పెండింగ్‌లో ఉన్న ఫారం-6, 7, 8 దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు, జాబితా తయారీపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన జిల్లా కలెక్టర్

ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో: వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటరు నమోదు, జాబితా తయారీపై ప్రత్యేక దృష్టి సారించి, అర్హులైన ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో వరంగల్--ఖమ్మం-- నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు, జాబితా తయారీ, ఎస్ఐఆర్ ప్రక్రియపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి సమావేశం నిర్వహించారు. జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియలో 1,75,858 అనామలీస్, నో మ్యాపింగ్ ఓటర్లు గుర్తించగా, వారిలో 1,69,802 మందికి నోటీసులు అందజేశామని, 1,36,208 మంది ఓటర్ల హియరింగ్ పూర్తి చేశామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న 5,460 ఫారం-6, 1,172 ఫారం-7 దరఖాస్తులు, 9,087 ఫారం-8 దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో అభ్యంతరాల సమర్పణకు అక్టోబర్ 7 చివరి తేదీ అని, నవంబర్ 5 వరకు నోటీసుల ప్రక్రియ, అభ్యంతరాల పరిష్కారం అనంతరం నవంబర్ 9న తుది ఎస్ఐఆర్ జాబితా ప్రచురించే ప్రక్రియ ఉంటుందని తెలిపారు.

**ప్రతి పట్టభద్రుడిని ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేయాలి**

వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ప్రతి ఎన్నికల సమయంలో పట్టభద్రులు తప్పనిసరిగా తాజాగా ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. తేది: 31-10-2023 నాటికి పట్టభద్రులైన అర్హులు, 01-11-2026ను అర్హత తేదీగా తీసుకొని రూపొందించే ఎమ్మెల్సీ ఓటరు జాబితాలో తమ పేరును నమోదు చేసుకోవాలని సూచించారు. అర్హత కలిగిన పట్టభద్రులు ఫారం-18ను పట్టభద్రత ధ్రువీకరణ పత్రంతో సంబంధిత ఈఆర్ఓ, ఆర్డీఓ కార్యాలయంలో లేదా ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

**2 లక్షల మంది పట్టభద్రుల నమోదు లక్ష్యం:** గతంలో ఖమ్మం జిల్లాలో సుమారు 84 వేల మంది పట్టభద్రులు



మాత్రమే ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు అయ్యారని, ఈసారి కనీసం 2 లక్షల మంది పట్టభద్రులను ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు చేయడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ప్రతి గ్రామంలో ప్రత్యేక గ్రామసభలు, పట్టణాల్లో వార్డు సభలు నిర్వహించి ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. టామ్‌టామ్ ద్వారా ప్రచారం నిర్వహించడంతో పాటు ప్రత్యేక పోస్టర్లు, అవగాహన వీడియోలు రూపొందించి ప్రజలకు చేరేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

**కళాశాలల్లో ప్రత్యేక నమోదు కార్యక్రమాలు:** జిల్లాలోని ప్రతి డిగ్రీ, ప్రొఫెషనల్, పీజీ కళాశాలలో ప్రత్యేక ప్రచార దినోత్సవం నిర్వహించి కళాశాల నుండి గ్రాడ్యుయేట్ పూర్తి చేసిన వారి వివరాలు తీసుకొని, అర్హులైన పట్టభద్రులను ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రతి మండలంలో మొత్తం ఓటర్ల జాబితాను పరిశీలించి, 25 నుంచి 60 సంవత్సరాల వయస్సు గల ఓటర్లలో పట్టభద్రులైన వారిని గుర్తించి, అర్హులైన ప్రతి ఒక్కరినీ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేయడాన్ని లక్ష్యంగా పెట్టుకోవాలని తెలిపారు. ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియలో బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) కూడా చురుకుగా భాగస్వాములు కావాలని కలెక్టర్ సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ పరిధిలోని అర్హులైన పట్టభద్రులను గుర్తించి ఓటరుగా నమోదు చేసుకునేలా సహకరించాలని కోరారు.

**ఎమ్మెల్సీ ఓటింగ్ విధానంపై అవగాహన కల్పించాలి:** ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత, రెండో ప్రాధాన్యత ఓటు తదితర అంశాలపై ఓటర్లకు పూర్తి అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎలా ఓటు వేయాలి, ప్రాధాన్యతా ఓటు విధానం ఎలా ఉంటుంది అనే అంశాలపై అవసరమైన అవగాహన వీడియోలను రూపొందించి విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి సంబంధించి 01-11-2026ను అర్హత తేదీగా తీసుకొని ఓటరు జాబితా తయారీ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. ఓటర్ జాబితా నమోదు నోటిఫికేషన్ 28-09-2026న, మొదటి పునఃప్రచురణ 15-10-2026న, రెండో పునఃప్రచురణ 25-10-2026న జరుగుతుందని తెలిపారు. ఫారం-18 దరఖాస్తుల స్వీకరణకు 06-11-2026 చివరి తేదీ అని పేర్కొన్నారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితా ముద్రణ 20-11-2026 నాటికి పూర్తి చేసి, 25-11-2026న డ్రాఫ్ట్ ఓటరు జాబితాను ప్రచురిస్తామని తెలిపారు. క్లెయిమ్స్, అభ్యంతరాలను 25-11-2026 నుంచి 10-12-2026 వరకు స్వీకరిస్తామని, వాటిని 25-12-2026 లోపు పరిష్కరించి, 30-12-2026న తుది ఓటరు జాబితాను ప్రచురించేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ ఓటరు నమోదు, జాబితా విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఎస్‌డీసీ సదానందం, ఆర్డీఓ శ్రీనివాస్, ఎన్నికల విభాగ డిటి అన్సారీ, బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధి బెల్లం వేణుగోపాల్, బీఆర్ ఎస్ వి ప్రతినిధి ఎల్. సతీష్ బాబు, సీపీఎం పార్టీ ప్రతినిధులు డి. తిరుపతి రావు, ఆర్. ప్రకాష్, ఐఎన్ సి పార్టీ ప్రతినిధులు అన్నెం గోపాల్ రావు, జి. సూర్యనారాయణ, బీఎస్పీ పార్టీ ప్రతినిధి వేల్పుల రామయ్య, బిజెపి పార్టీ ప్రతినిధి వి. రాజేష్, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి స్వర్ణ సుబ్బారావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.